# విశాలభారతి

తెలుగు దిన పత్రిక

epaper:vishalabharati.com

శనివారం, హైదరాబాద్ 19.04.2025 | 24 క్యారెట్లు 89,478.00 | కిలో వెండి 1,07,580.00 | 37 °C | సంపుటి:3 | సంచిక:168

www.vishalabharati.com


## భగవద్గీతకు యునెస్కో గుర్తింపు

- భరత ముని రచించిన నాట్యశాస్త్రానికి కూడా..
- మెమరీ ఆఫ్ ది వరల్డ్ రిజిస్టర్‌లో చోటు
- భారతీయ సంస్కృతి, తాత్విక వారసత్వానికి దక్కిన గుర్తింపు
- యునెస్కో గుర్తింపుపై ప్రధాని మోదీ



విశాలభారతి, నేషనల్ బ్యూరో: భారతదేశ వారసత్వ సంపదలు భగవద్గీత, భరత ముని రచించిన నాట్యశాస్త్రం రాతప్రతులు యునెస్కోకు చెందిన మెమరీ ఆఫ్ ది వరల్డ్ రిజిస్టర్‌లో చోటు దక్కించుకున్నాయి. ఈ విషయాన్ని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ ఎక్స్ వేదికగా ప్రకటించారు. ఈ రిజిస్టర్‌లో కొత్తగా చేర్చిన 74 డాక్యుమెంటరీ వారసత్వ సంపదలలో వైజ్ఞానిక విప్లవం, చరిత్రలో మహిళల పాత్ర, 72 దేశాలు, నాలుగు అంతర్జాతీయ సంస్థల బహుళ పక్ష అంశాలకు చెందిన ప్రధాన మైలురాళ్లు ఉన్నట్లు యునెస్కో తెలిపింది. రిజిస్టర్‌లో గ్రంథాలు, రాతప్రతులు, చిత్రపటాలు, ఫొటోలు, శబ్ద లేక వీడియో రికార్డింగులు మానవాళికి చెందిన వారసత్వ డాక్యుమెంటరీగా పొందుపరిచి ఉన్నాయి.

ఏప్రిల్ 18న ప్రపంచ వారసత్వ దినోత్సవం సందర్భంగా ఈ పరిణామం చోటుచేసుకుంది. మెమరీ ఆఫ్ ది వరల్డ్ రిజిస్టర్‌లో

..మిగతా 2 లో



## హైదరాబాద్‌లో ఏఐ క్లస్టర్

### రూ. 10,500 కోట్ల పెట్టుబడులు

జపాన్ పర్యటనలో తెలంగాణ బృందం శుక్రవారం రూ. 11,062 కోట్ల భారీ పెట్టుబడులు సాధించింది. డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, ఐటీ సర్వీసుల్లో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన సంస్థ ఎన్‌టీటీ డేటాతోపాటు ఏఐ–ఫస్ట్ క్లౌడ్ ప్లాట్‌ఫాం సంస్థ నెయిసా నెట్‌వర్క్స్ సంయుక్తంగా హైదరాబాద్‌లో రూ. 10,500 కోట్లతో 400 మెగావాట్ల ఏఐ డేటా సెంటర్ క్లస్టర్ ఏర్పాటుకు ముందుకొచ్చాయి.

- సంయుక్తంగా ఏర్పాటుకు ముందుకొచ్చిన ఎన్‌టీటీ డేటా, నెయిసా నెట్‌వర్క్స్
- టోక్యోలో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో ఒప్పందం
- రుద్రారంలో తోషిబా అనుబంధ సంస్థ టీటీడీఐ
- ట్రాన్స్‌ఫార్మర్ల పరిశ్రమ విస్తరణ బాట
- రూ. 562 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు అంగీకారం..



విశాలభారతి, స్టేట్ బ్యూరో: శుక్రవారం టోక్యోలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో రాష్ట్ర ప్రభుత్వం, ఆయా సంస్థల ప్రతినిధుల మధ్య త్రైపాక్షిక ఒప్పందం కుదిరింది. ఎన్‌టీటీ డేటా, నెయిసా నెట్‌వర్క్స్ నుంచి బోర్డు సభ్యుడు కెన్ కట్సుయామా, డైరెక్టర్ తడావోకి నిషిమురా, ఎన్‌టీటీ గ్లోబల్ డేటా సెంటర్స్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ అలోక్ బాజ్‌పాయ్, నెయిసా సీఈవో, ఎన్‌టీటీ గ్లోబల్ డేటా చైర్మన్ శరద్ సంఘీ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. టోక్యో హెడ్ క్వార్టర్స్‌గా కార్యకలాపాలు సాగిస్తున్న ఎన్‌టీటీ డేటా.. 50కిపైగా దేశాల్లో 1,93,000 మంది ఉద్యోగులతో ప్రపంచంలోని టాప్-3 డేటా సెంటర్ ప్రొవైడర్లలో ఒకటిగా ఉంది. హైదరాబాద్‌లో నిర్మించబోయే 400 మెగావాట్ల డేటా సెంటర్ క్లస్టర్ 25,000 జీపీయూలతో దేశంలోనే అత్యంత

..మిగతా 3 లో

## ప్రభుత్వ భూములకు ‘భూ భారతి’ రక్ష

### గ్రామానికో రెవెన్యూ ఖాతా

- సెక్షన్ 13(12) ద్వారా వీలు కల్పించిన ప్రభుత్వం
- నీటి వనరులు, ప్రభుత్వ, పట్టా భూముల వివరాల నమోదు
- ప్రతి ఏటా డిసెంబరు 31న అచ్చు వేసి పదిలపరిచేలా నిబంధన



విశాలభారతి, స్టేట్ బ్యూరో: ప్రతి రైతుకు ఒక భూమి ఖాతా ఉన్నట్లే.. ఇకపై ప్రతి గ్రామానికో రెవెన్యూ ఖాతా (విలేజ్ ఎకౌంట్) నిర్వహించేలా ప్రభుత్వం కొత్త చట్టం భూ భారతిలో నిబంధన తీసుకొచ్చింది. ధరణికి ముందు 32 కాలమ్‌లతో పహాణీ నిర్వహణ ఉండేది. ఆర్వోఆర్ 2020తో అది రద్దయ్యింది. ఒకే కాలమ్‌తో పహాణీ

..మిగతా 2 లో



## కిషన్‌రెడ్డీ.. రాష్ట్రానికి ఏం చేశావ్?

- మతం, ఒవైసీ జపం తప్ప అభివృద్ధి ఏది?
- మెట్రో విస్తరణ, విభజన హామీలు పట్టవా?
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ-బీఆర్ఎస్ కుమ్మక్కు
- పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్
- పార్టీ లైన్ దాటితే చర్యలు తప్పవు
- కాంగ్రెస్ నేతలకు వార్నింగ్

3లో

## 33 శాతం సీట్లు మహిళలకే

- మహిళా నేతలకు కేసీఆర్ గుడ్ న్యూస్
- గ్రామస్థాయి నుంచి జన సమీకరణ చేయాలి
- సమన్వయంతో పని చేసి సభను సక్సెస్ చేద్దాం
- బీఆర్ఎస్ వైభవాన్ని మరో సారి చూపిద్దాం
- పార్టీ నేతలతో కేసీఆర్ చర్చలు



విశాలభారతి, స్టేట్ బ్యూరో: దేశంలో త్వరలోనే మహిళా బిల్లు రాబోతున్నదని.. ఆ బిల్లుతో మహిళలకు 33 శాతం సీట్లు వస్తాయని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చెప్పారు. ఎర్రవెల్లిలోని ఫాంహౌజ్‌లో పార్టీ మహిళా నేతలతో కేసీఆర్ భేటీ అయ్యారు. రాబోవు రోజుల్లో మహిళలంతా ఉత్సాహంగా పనిచేయాలని

..మిగతా 2 లో

## గ్రూప్-1 పరీక్ష రద్దు చేయాల్సిందే..

- ప్రిలిమినరీ, మెయిన్స్ మళ్లీ నిర్వహించాలి
- సీఎంకు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత బహిరంగ లేఖ
- నియామకాల్లో అంతటా అవకతవకలు
- యువత జీవితాలతో సర్కార్ చెలగాటమా?
- పరీక్షలు, ఫలితాల వెల్లడిలో అనేక సందేహాలు
- హైకోర్టు తీర్పు హర్షణీయమని వ్యాఖ్య



విశాలభారతి, స్టేట్ బ్యూరో: టీజీపీఎస్సీ గ్రూప్ 1 నోటిఫికేషన్‌ను రద్దుచేసి, అన్ని పరీక్షలు మళ్లీ నిర్వహించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. పరీక్షల నిర్వహణ, ఫలితాలపై ఎన్నో అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ప్రిలిమినరీ, మెయిన్స్ పరీక్షలను రద్దుచేసి, తిరిగి నిర్వహించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ

..మిగతా 2 లో



## కాంగ్రెస్, బీఆర్ఎస్.. మజ్లిస్ పార్టీ ఏజెంట్స్

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీని ఓడించే కుట్ర
- కాంగ్రెస్ ఎందుకు పోటీచేయడం లేదు
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

2 లో

## తెలంగాణ నూతన సీఎస్ జయేశ్ రంజన్?

### సలహాదారుడుగా రామకృష్ణారావు!

- ఎన్నికల సమయంలో సీఎస్‌గా వికాస్ రాజ్?
- పదవి ఎంపికలో బీసీ, ఎస్సీ ఫార్ములా
- ఎస్సీ, బీసీలకు ఇచ్చామని చెప్పుకొనే చాన్స్
- రామకృష్ణారావు రిటైర్‌మెంట్‌కు ఆరు నెలలే వ్యవధి
- ఇదే ఆయనకు ప్రతికూల అంశం
- పెట్టుబడుల సాధనలో అందెవేసిన చెయ్యి.. జయేశ్
- అదే ఆయనకు కలిసొచ్చే అవకాశమా?
- నెలాఖరుకు శాంతికుమారి రిటైర్మెంట్
- కొత్త సీఎస్ ఎంపికపై జోరుగా చర్చలు



విశాలభారతి, స్టేట్ బ్యూరో: తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎంపికలో సమీకరణలు మారతున్నాయి. నిన్నటి వరకు విన్పించిన సీనియర్ ఐఏఎస్ అధికారి పేరు స్థానంలో మరో ఇద్దరి పేర్లు తెరమీదకు వచ్చాయి. నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నియామకంలో సామాజిక సమీకరణలు, అధిక కాలం సర్వీసు అంశాలను కాంగ్రెస్ అధినాయకత్వం పరిగణనలోకి తీసుకున్నదని సమాచారం. ఈ నేపథ్యంలో ఎక్కువ కాలం సర్వీసు ఉన్న ఇద్దరు అధికారుల పేర్లలో ఒకరిని సెలెక్ట్

..మిగతా 3 లో




## 24 మందికి 100 పర్సంటేజ్

### జేఈఈ మెయిన్ ఫలితాల విడుదల

- తెలంగాణ నుంచి ముగ్గురు.. ఏపీ నుంచి ఒకరు
- తెలుగు విద్యార్థులకు 8, 16, 22, 24వ ర్యాంకులు

3 లో



## హైదరాబాద్‌లో ఈదురుగాలుల బీభత్సం

- పొద్దున ఎండ, సాయంత్రం దంచికొట్టిన వాన
- చెరువులను తలపించిన రోడ్లు
- పలుచోట్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం

2 లో

# విశాల భారతి

తెలుగు దిన పత్రిక

శనివారం,
19.04.2025
హైదరాబాద్

epaper:vishalabharati.com
www.vishalabharati.com




## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో అక్రమాలు సహించం

విశాలభారతి, స్టేట్ బ్యూరో: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పథకంలో అవకతవకలకు పాల్పడే ఎలాంటి వారినైనా ఉపేక్షించమని రాష్ట్ర గృహ నిర్మాణ, రెవిన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు.... ఇందిరమ్మ ఇళ్ల బిల్లుల విషయంలో అక్రమాలకు పాల్పడితే సంబంధిత అధికారులపై కఠినచర్యలు తీసుకుంటామన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో బేస్ మెంట్ నిర్మాణం పూర్తి కాకుండానే తప్పడు సమాచారాన్ని అప్ లోడ్ చేసిన బిల్ కలెక్టర్ జగదీష్‌పై చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశాలు జారీ చేయగా.. జిల్లా పంచాయతీ అధికారి జగదీష్ ను విధుల నుంచి తొలగించారు. భద్రాచలం గ్రామపంచాయతీ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించి 18 మంది లబ్ధిదారులు బేస్ మెంట్ వరకు నిర్మాణం పూర్తి చేశారనే తప్పడు సమాచారాన్ని ఆన్ లైన్ లో నమోదు చేశారని, దీనిపై సంబంధిత బిల్ కలెక్టర్ కు మెమో జారీ చేయగా పొరపాటున ఈ సమాచారాన్ని అప్‌లోడ్ చేయడం అయిందని సంజా యిషి ఇవ్వడంతో ఆ బిల్ కలెక్టర్ ను ఉద్యోగాన్ని తొలగిస్తూ ఆదేశాలు జారీ చేసినట్టు జిల్లా పంచాయతీ అధికారి వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించి అలసత్వం వహించే ఎంతటి వారినైనా సహించేది లేదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

## భగవద్గీతకు
# యునెస్కో గుర్తింపు

తరువాయి భాగం

భగవద్గీత, నాట్యశాస్త్ర గ్రంథాలు చోటు దక్కించుకోవడంపై ప్రధాని నరేంద్ర మోదీ స్పందిస్తూ ఇవీ ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతి భారతీయునికి గర్వించే క్షణాలని చెప్పారు. భారతీయ జ్ఞాన సంపద, కళాత్మక ప్రతిభను యావత్ ప్రపంచం గౌరవిస్తోందని, ఈ రచనలు మనదేశంపై ప్రపంచ దృక్పథానికి, మన జీవన విధానానికి పునాదులని మంత్రి షెకావత్ పేర్కొన్నారు. ఇప్పటివరకు మన దేశం నుంచి 14 శాసనాలు యునెస్కో రిజిస్టర్‌లో చోటు దక్కించుకున్నాయని తెలిపారు.

క్రీస్తు పూర్వం 2వ శతాబ్దంలో భరత ముని రచించిన నాట్యశాస్త్రంలో మొత్తం 36,000 శ్లోకాలు ఉన్నాయి. గంధర్వ వేదగా పిలిచే ఈ శ్లోకాలు నాట్యశాస్త్ర సారాన్ని సంపూర్ణంగా తెలియచేస్తాయి. ఇక మహాభారత యుద్ధ రంగంలో హితులు, సోదరులు, గురువులు, బంధు జనులను చూసి అస్త్ర సన్యాసం చేసిన అర్జునుడికి శ్రీకృష్ణుడు చేసిన బోధను భగవద్గీతగా భారతీయులు విశ్వసిస్తారు. ఇందులో 18 అధ్యాయాలలో మొత్తం 700 శ్లోకాలు ఉన్నాయి.

**భారతీయుడికి గర్వకారణం: మోదీ**

"ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతి భారతీయుడికి ఇది గర్వకారణమైన క్షణం. యునెస్కో మెమరీ ఆఫ్ వరల్డ్ రిజిస్టర్‌లో భగవద్గీత, నాట్యశాస్త్రం చేర్చడం అంటే మన కాలాతీత జ్ఞానం, గొప్ప సంస్కృతికి ప్రపంచవ్యాప్తంగా దక్కిన ఘనమైన గుర్తింపు. గీత, నాట్యశాస్త్రం శతాబ్దాలుగా నాగరికత, చైతన్యాన్ని పెంపొందించాయి. ప్రపంచానికి స్ఫూర్తినిస్తూనే ఉన్నాయి" అని ప్రధాని మోదీ అన్నారు.

## ప్రభుత్వ భూములకు
# 'భూ భారతి' రక్ష

తరువాయి భాగం

ఏర్పాటు చేశారు. చేతిరాతతో రాసే దస్త్రాలకు బదులు అన్నీ ఆన్‌లైన్ చేసేశారు. ముద్రణ ప్రతులు అందుబాటులో లేవు. తాజాగా ప్రతి గ్రామానికి ఒక ఖాతా ఉండేలా ఆర్వోఆర్2025 చట్టం వీలు కల్పిస్తోంది. దీని వల్ల గ్రామంలోని అన్ని రకాల భూముల వివరాలు ఒకేచోట పదిలం కానున్నాయి. గ్రామ ఖాతాను నిర్వహించేందుకు వచ్చే నెలలో గ్రామ పరిపాలన అధికారుల(జీపీవో)ను ప్రభుత్వం నియమించనుంది.

2014కు పూర్వం గ్రామాల్లో రెవెన్యూశాఖ ఏటా జమాబందీ నిర్వహించేది. రెవెన్యూ, వ్యవసాయ, నీటిపారుదల శాఖల సిబ్బంది ఏడాదికోమారు గ్రామంలోని వ్యవసాయ భూముల వివరాలను, ఆ ఏడాది చోటు చేసుకున్న అన్ని రకాల మార్పులు, చేర్పులను ఇందులో నమోదు చేసేవారు. వీఆర్వో, వీఆర్ఏలు నమోదు చేసిన మార్పులను పహాణీల్లోని సమాచారంతో పోల్చి తహసీల్దారు కార్యాలయానికి నివేదించేవారు. ఆ సమాచారాన్ని రెవెన్యూ మాతృ రికార్డు 1బిలో నమోదు చేసేవారు. 2014 తరువాత జమాబందీ, పహాణీ నమోదు తదితర ప్రక్రియలు నిలిచిపోయాయి. కొత్త చట్టంలోని సెక్షన్ 13(12) ద్వారా గ్రామ రెవెన్యూ రికార్డుల నిర్వహణకు వీలు కల్పించింది. దీని ప్రకారం గ్రామ పహాణీ, ప్రభుత్వ భూముల రిజిస్టర్, మార్పుల రిజిస్టర్, నీటి వనరుల రిజిస్టర్‌లను ప్రత్యేకంగా నిర్వహిస్తారు. ఆర్వోఆర్‌లోని వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేయనున్నారు. సాగు భూముల రిజిస్ట్రేషన్‌తోపాటు మ్యుటేషన్ జరిగిన ప్రతిసారి ఆన్‌లైన్ గ్రామ రికార్డుల్లోనూ మార్పులు జరుగుతాయి. ఈ వివరాలన్నింటినీ ఏటా డిసెంబరు 31న ముద్రిస్తారు. దీనివల్ల ఆన్‌లైన్‌లోనే కాకుండా ముద్రిత దస్త్రాలు కూడా అందుబాటులో ఉండనున్నాయి.

రాష్ట్రంలో చెరువులు, కుంటలకు చెందిన భూములు పెద్దఎత్తున మాయమవుతున్నాయి. ఈ కబ్జాలను కట్టడి చేయడానికి ఏటా ఒక రిజిస్టర్‌ను నిర్వహిస్తారు. విస్తీర్ణం, ఎఫ్టీఎల్, బఫర్‌జోన్ ప్రాంతాలు, ఆయకట్టు, సాగునీటి కాలువలు, చెరువులు లేదా కుంటలోకి నీటిని తెచ్చే పాటు కాలువల వివరాలనూ నమోదు చేస్తారు. ఆన్‌లైన్‌లోనూ ఈ వివరాలు అందుబాటులో ఉంటాయి. దీనివల్ల కబ్జా జరిగితే పాత రికార్డుల ఆధారంగా చర్యలు తీసుకోవచ్చని అధికారులు వెల్లడించారు.



# హైదరాబాద్‌లో ఈదురుగాలుల బీభత్సం

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

హైదరాబాద్‌లో వర్షం మరోసారి బీభత్సం సృష్టించింది. ఈసారి భారీ వర్షానికి ఈదురుగాలులు తోడయ్యాయి. తూర్పు, మధ్య తెలంగాణ అల్పపీడనం ద్రోణి ప్రభావం, క్యూములోనింబస్ మేఘాలతో సుమారు 2 గంటల పాటు నగరంలోని వివిధ ప్రాంతాలను వర్షం అతలాకుతలం చేసింది. పలుచోట్ల ఈదురుగాలులతో మొదలైన వాన క్రమక్రమంగా నగరమంతా విస్తరించింది. ఈదురుగాలులతో పలు చోట్ల భారీ వర్షం కారణంగా రహదారులు క్షణాల్లోనే చెరువులుగా మారిపోయాయి. రోడ్లపై వాహనదారులు అటు ఈదురు గాలులు, ఇటు వర్షం మధ్య చిక్కుకుపోయి ఇబ్బందులు పడ్డారు. బండ్లగూడలో 8 సెంటీ మీటర్ల వర్షం నమోదు కాగా బహదూర్‌పుర 7, చార్మినార్ 7, నాంపల్లిలో 6 సెంటీ మీటర్లుగా నమోదైంది.

**కూలిన చెట్లు..**

నాంపల్లి, హిమాయత్ నగర్, ముషీరాబాద్, ఖైరతాబాద్‌లో ఒక్కసారిగా ఈదురు గాలులలో వాన కురిసింది. మొత్తంగా 21 ప్రాంతాల్లో వృక్షాలు నెలకొరిగాయి. సహాయ చర్యలకోసం హైడ్రాతో పాటు డీఆర్ఎఫ్ బృందాలు రంగంలోకి దిగాయి. నాంపల్లి రెడ్ హిల్స్‌లో గాలుల తీవ్రతకు ఓ చెట్టు కూలి పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ పై పడింది. దీంతో ట్రాన్స్‌ఫార్మర్ భారీశబ్దంతో పేలిపోయింది. అటు బషీర్ బాగ్‌లోని నిజాం లా కాలేజ్ ముందు కూడా ఓ చెట్టు కూలిపోయింది. దీంతో ఆ మార్గంలో ట్రాఫిక్‌కు ఇబ్బంది ఏర్పడి వాహనాలు నిలిచిపోయాయి. లంగర్‌హౌస్ బాపునగర్ కాలనీలో భారీ వృక్షం కూలిన ఘటనలో రెండు విద్యుత్ స్తంభాలు ఒరిగిపోయాయి. ఫలితంగా ఈ ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. తిరిగి పునరుద్ధరించేందుకు సుమారు 5 గంటల సమయం పడుతుందని అధికారులు తెలిపారు. గాలుల ఉధృతి తీవ్రంగా ఉండటంతో దాదాపు నగరమంతటా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కుత్బుల్లాపూర్, దుండిగల్, సుచిత్ర, కొంపల్లి, జగద్గిరిగుట్ట తదితర ప్రాంతాల్లోనూ ఈదురుగాలులతో మోస్తరు వర్షం కురిసింది. సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఏరియా పరిధిలో ముందుగా ఈదురుగాలులు భయంకరమైన వాతావరణం సృష్టించాయి. దిల్‌సుఖ్‌నగర్ మలక్‌పేట, కోఠి, చాంద్రాయణగుట్ట, అమీర్‌పేట, ఖైరతాబాద్ చౌరస్తాలు జలమయంగా మారాయి. ఎక్కడా చూసినా నిలిచిపోయిన వాననీటితో ట్రాఫిక్ స్తంభించిపోయింది. బేగంపేట, రాణిగంజ్, ప్యారడైజ్, ప్యాట్నీ, మారేడ్ పల్లి, సీతాఫల్ మండి, మోండా మార్కెట్, రెజిమెంటల్ బజార్, బోయిన్‌పల్లి, ఉప్పల్, తార్నాక, ఎర్రగడ్డ, భరత్‌నగర్, కూకట్‌పల్లి, మియాపూర్, లింగంపల్లి చిగురుటాకులా వణికిపోయింది. తరువాత భారీ వర్షం మొదలైంది. మలక్‌పేటలోని రైల్వే బ్రిడ్జి కిందకు వర్షపు నీరు చేరి ట్రాఫిక్ కాసేపు పూర్తిగా నిలిచిపోయింది. జీహెచ్ఎంసీ సిబ్బంది వచ్చి వర్షం నీరు తోడేసిన తరువాతే వాహనాల రాకపోకలు తిరిగి ప్రారంభమయ్యాయి.

# కాంగ్రెస్‌లోకి మాజీ సర్పంచ్ రాజేష్ నాయక్?

- అదే బాటలో డాక్టర్ సోమేశ్వరరావు?
- పాలకుర్తిలో బీటలు వారుతున్న బీఆర్ఎస్ కోట

తొర్రూరు, విశాలభారతి:



డాక్టర్ సోమేశ్వర రావు



డాక్టర్ రాజేష్ నాయక్

పాలకుర్తి నియోజకవర్గంలో బీఆర్ఎస్ కోటకు బీటలు బారుతున్నాయా?... గులాబీ పార్టీ కీలక నాయకులు పార్టీ మారబోతున్నారా?.... మాజీ మంత్రి ఎర్రబెల్లికి కుడి భుజంగా ఉన్న నాయకులు కారు దిగుతున్నారా? అనే ప్రశ్నలకు అవుననే సమాధానాలు వినిపిస్తున్నాయి. రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ముఖ్య అనుచరులు, తొర్రూరు మేజర్ గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ డాక్టర్ ధరావత్ రాజేష్ నాయక్, బీఆర్ఎస్ పార్టీ మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ పొనుగోటి సోమేశ్వర రావులు పార్టీ మారెందుకు రంగం సిద్ధమైనట్లు తెలుస్తోంది.

అతి త్వరలో కాంగ్రెస్ లో చేరేందుకు వారు నిర్ణయించుకున్నట్లు తెలిసింది. దీంతో పాలకుర్తి నియోజకవర్గం లో పాలిటిక్స్ కొత్త రూపు సంతరించుకోనుంది. పాలకుర్తి నియోజకవర్గం లో బీఆర్ఎస్ కు ఆయువు పట్టుగా ఉన్న తొర్రూరు ఒక్కొక్కరు కారు దిగి హస్తం పార్టీకి దగ్గరవుతున్నారు. ఇప్పుడు ఏకంగా మాజీ సర్పంచ్ రాజేష్‌నాయక్, డాక్టర్ సోమేశ్వరరావు లు బీఆర్ఎస్ ను వీడుతుండటం ఆ పార్టీలో కలకలం రేపుతోంది. పార్టీ మారుతున్న విషయం సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం జరుగుతుంది. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి దయాకర్ రావు వారితో మాట్లాడి బుజ్జగించేందుకు ప్రయత్నించినట్లు సమాచారం. కానీ వారు బీఆర్ఎస్ లో కొనసాగేందుకు సుముఖంగా లేమని తేల్చినట్లు తెలుస్తోంది. డాక్టర్ రాజేష్ నాయక్ తొర్రూరు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ గా కొనసాగి దయాకర్ రావు ముఖ్య అనుచరునిగా పేరుందారు. ఆయన సహకారంతో దయాకర్ రావుకు గిరిజన, లంబాడా ప్రాంతాల్లో మంచి మద్దతు లభించింది. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పీహెచ్ డీ పూర్తి చేసిన రాజేష్ నాయక్ తెలంగాణ ఉద్యమ సమయంలో ఓయూ జెఏసి చైర్మన్ గా వ్యవహరించి ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షను రగిలించారు. ఎన్నో సామాజిక ఉద్యమాల్లో ప్రధాన భూమిక పోషించారు. తదనంతరం నవ తెలంగాణ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యునిగా సైతం కొనసాగారు. డాక్టర్ సోమేశ్వర రావు సైతం దయాకర్ రావుకు నమ్మిన బంటుగా రాజకీయాల్లో ఆయన వెన్ను తట్టారు. ప్రతి ఎన్నికల్లో దయన్న గెలుపుకు కాలికి బలపం కట్టుకొని తిరిగి ప్రచారం చేశారు. గెలిచేంతవరకే నాయకులను దగ్గర ఉంచుకొని గెలిచాక ఆయనను పూర్తిగా విస్మరించాడనే ప్రచారం ప్రజల్లో ఉంది. ఆయన స్థాయికి తగ్గ పదవీ, గౌరవం ఇవ్వలేదని ప్రజల్లో భావన ఉంది. అనామకులకు కీలక బాధ్యతలు, పదవులు అప్పగించిన ఎర్రబెల్లి సోమేశ్వరరావుకు ఏ పదవి ఇవ్వడానికి ఇష్టపడ లేదని ప్రచారం జరిగింది. గత కొంతకాలంగా డాక్టర్ రాజేష్ నాయక్, డాక్టర్ సోమేశ్వర రావులు బీఆర్ఎస్ కార్యకలాపాలకు దూరంగా ఉంటున్నారు. ఈ సమయంలో పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జి ఝాన్సీ రెడ్డిలు వీరి ప్రాధాన్యతను గుర్తించి పార్టీలోకి ఆహ్వానించినట్లు తెలుస్తోంది. ఇదే నిజమైతే బీఆర్ఎస్ పార్టీలో చేరికల పర్వం మరింత పెరిగే అవకాశం ఉంటుంది. ప్రజా బలం ఉన్న ఈ నాయకులతో హస్తం పార్టీకి లాభం చేకూరే అవకాశం ఉంటుందని స్థానిక నాయకులు, రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# 33 శాతం సీట్లు మహిళలకే

తరువాయి భాగం

సూచించారు. రాజకీయాల్లో ప్రత్యక్షంగా తిరిగే మహిళలకే అవకాశాలు లభిస్తాయని చెప్పారు. ఇప్పటి నుంచే నిత్యం ప్రజల్లో ఉండాలని సూచించారు. మహిళా బిల్లుతో రాష్ట్రంలో పార్టీ తరఫున 33 శాతం సీట్లు కేటాయిస్తామని.. నాయకుల భార్యలకు కాకుండా పార్టీలో యాక్టివ్‌గా పనిచేస్తున్న వారికే సీట్లు ఇస్తామని కేసీఆర్ చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. త్వరలోనే తెలంగాణ భవన్‌లో మహిళా నేతలతో పెద్ద ఎత్తున మీటింగ్ పెడుతామని వెల్లడించారు.

**భారీగా ఏర్పాట్లు..**

బీఆర్ఎస్ రజతోత్సవ సభకు గ్రామ స్థాయి నుంచి జనసమీకరణ చేయాలని, నేతలందరూ సమన్వయంతో పనిచేసి సభను సక్సెస్ చేయాలని మాజీ సీఎం, బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ సూచించారు. బీఆర్ఎస్ వైభవాన్ని మరో సారి కాంగ్రెస్‌కు చూపించాలని పిలుపునిచ్చారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో 27న నిర్వహించనున్న రజతోత్సవ సభ ఏర్పాట్లపై శుక్రవారం ఎర్రవెల్లిలోని ఫామ్‌హౌస్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్కతుర్తి వద్ద జరుగుతున్న సభ ఏర్పాట్ల గురించి ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు వినయ్‌భాస్కర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, ఒడితెల సతీష్ వివరించారు. 1200 ఎకరాల్లో సభ ఏర్పాట్లు ప్రారంభమయ్యాయని, పార్కింగ్‌కు సంబంధించి పనులు పూర్తి చేశామని తెలిపారు. 16కిలో మీటర్ల అప్రోచ్ రోడ్లు, 11కిలో మీటర్ల వరకు రోడ్డు పొడువునా ర్యాంపులు నిర్మించామని వెల్లడించానే. 10లక్షల వాటర్ బాటిళ్లు, 10లక్షల మజ్జిగ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుతున్నామన్నారు. శనివారం నుంచి సభా వేదిక నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ సభను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని అందరూ సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఎమ్మెల్సీ కవిత సారథ్యంలో సభా ప్రాంగణంలో మహిళల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

**ఎర్రబెల్లి, పల్లా డుమ్మా**

ఈ సమావేశంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, తాటికొండ రాజయ్య పాల్గొనకపోవడం చర్చనీయాంశంగా మారింది. బీఆర్ఎస్ నేతల మధ్య సమన్వయం లేదని, వర్ధన్నపేట నియోజకవర్గ ఇన్‌చార్జి విషయంలో ఎర్రబెల్లికి వ్యతిరేకంగా ఓ వర్గం పావులు కదిపిందనీ ఇటీవల ప్రచారం జరిగింది. ఈ కారణంగానే దేవన్నపేట వద్ద నిర్వహించాల్సిన సభను ఎల్కతుర్తికి తరలించారన్న వాదన ఉంది. అయితే సన్నాహక సమావేశాల్లో బిజీగా ఉండటం వల్లే ఎర్రబెల్లి సమీక్షకు రాలేదని, తమలో ఎలాంటి విభేదాలు లేవని పెద్ది సుదర్శన్‌రెడ్డి తెలిపారు.

# కాంగ్రెస్, బీఆర్ఎస్..
# మజ్లిస్ పార్టీ ఏజెంట్స్

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీని ఓడించే కుట్ర
- కాంగ్రెస్ ఎందుకు పోటీచేయడం లేదు
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

విశాలభారతి, స్టేట్ బ్యూరో:



కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు.. మజ్లిస్ కనుసన్నల్లో ఉన్నాయని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మండిపడ్డారు. హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలో కాంగ్రెస్, బీఆర్ఎస్ ఎందుకు పోటీ చేయడం లేదో ప్రజలకు జవాబివ్వాలని డిమాండ్ చేశారు. మజ్లిస్‌కు వ్యతిరేకంగా బీజేపీ పోరాటం చేస్తోందని తెలిపారు. బేగంపేటలో ఎమ్మెల్సీ ఎన్నికపై నిర్వహించిన బీజేపీ సన్నాహక భేటీలో ఆయన మాట్లాడారు. బీజేపీని ఓడించే ఏకైక లక్ష్యంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ పని చేస్తున్నాయని కిషన్ రెడ్డి విమర్శించారు. రాష్ట్రంలో తమ పార్టీ అధికారంలో ఉన్నా హైదరాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికలో ఎందుకు పోటీ చేయడం లేదో రాహుల్ గాంధీ చెప్పాలని డిమాండ్ చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన బీఆర్ఎస్.. ఈ ఎన్నికల్లో ఎందుకు బరిలోకి దిగడం లేదని ప్రశ్నించారు. తెలంగాణలో డబుల్ ఇంజిన్ సర్కార్ వస్తేనే ఈ నగరం అభివృద్ధి చెందుతుందని కిషన్ రెడ్డి అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ పార్టీ పట్ల ఎలా ఉండాలనేదానిపై కేటీఆర్ సర్టిఫికెట్ బీజేపీకి అవసరం లేదని అన్నారు.

# 24 మందికి 100 పర్సంటేజ్

- జేఈఈ మెయిన్ ఫలితాల విడుదల
- తెలంగాణ నుంచి ముగ్గురు.. ఏపీ నుంచి ఒకరు

విశాలభారతి, స్టేట్ బ్యూరో: దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు ఉత్కంఠగా ఎదురుచూస్తున్న జేఈఈ మెయిన్ సెషన్2 ఫలితాలు విడుదలయ్యాయి. పరీక్ష నిర్వహణ సంస్థ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) శుక్రవారం రాత్రి ఈ ఫలితాలను విడుదల చేసింది. శుక్రవారం మధ్యాహ్నం తుది కీ విడుదల చేసిన అధికారులు.. విద్యార్థులు సాధించిన పర్సంటైల్ స్కోరుతో ఫలితాలను విడుదల చేశారు. దేశ వ్యాప్తంగా ఉన్న ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీల్లో బీఈ/బీటెక్ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఏప్రిల్ 2, 3, 4, 7, 8 తేదీల్లో ఈ పరీక్షలు నిర్వహించగా.. 24 మంది విద్యార్థులు 100 పర్సంటైల్ సాధించారు. రాజస్థాన్‌కు చెందిన మహ్మద్ అనాస్ ఫస్ట్ ర్యాంకు, ఆయుష్ సింఘాల్ రెండో ర్యాంకు సాధించారు. 100 పర్సంటైల్ సాధించిన వారిలో తెలంగాణ నుంచి హర్ష ఎ.గుప్తా, వంగల అజయ్‌రెడ్డి, బనిబ్రత మజీ, ఏపీ నుంచి సాయిమనోజ్ఞ గుత్తికొండ ఉన్నారు. కాగా, హర్ష ఎ.గుప్తా దేశవ్యాప్తంగా 8వ ర్యాంకు సాధించగా, అజయ్‌రెడ్డి ఆలిండియా 16వ ర్యాంకుతో ఈడబ్ల్యూఎస్ కేటగిరీలో టాప్‌లో నిలిచాడు. సాయిమనోజ్ఞ ఆలిండియా 22వ ర్యాంకు, బాలికల్లో 2వ ర్యాంకు సాధించింది. బనిబ్రత మజీకి ఆలిండియా 24వ ర్యాంకు లభించింది.

# గ్రూప్1 పరీక్ష రద్దు చేయాల్సిందే..

తరువాయి భాగం

శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. గ్రూప్ 1పై హైకోర్టు తీర్పు నేపథ్యంలో ఆమె రాసిన ఈ లేఖ ద్వారా గ్రూప్ 1లో పరీక్షలు, ఫలితాలపై అభ్యర్థులు వ్యక్తం చేస్తున్న అనుమానాలు, సందేహాలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. గ్రూప్ 1 నిర్వహణలో ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల నిరుద్యోగుల జీవితాలు అగాథంలో పడ్డాయని మండిపడ్డారు.

నియామకాల్లో పారదర్శకత, జవాబుదారీతనం లోపించిన విషయం తేటతెల్లమైందని పేర్కొన్నారు. యువత జీవితాలతో రాష్ట్ర ప్రభుత్వం చెలగాటమాడటం ఆక్షేపనీయమని పేర్కొన్నారు. ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలకు వేర్వేరు హాల్‌టికెట్లను జారీచేయడంతోనే గందరగోళం సృష్టించారని దుయ్యబట్టారు. 21,075 మంది మెయిన్స్ పరీక్షలకు హాజరయ్యారని టీజీపీఎస్సీ ప్రకటించిందని, కానీ ఫలితాలు ప్రకటించే నాటికి అభ్యర్థుల సంఖ్య 21,085 మందికి చేరిందని, దీంతో అదనంగా ఆ 10 మంది అభ్యర్థుల సంఖ్య ఎలా పెరిగిందంటూ ప్రశ్నించారు. ఉర్దూ మీడియంలో 9 మంది పరీక్షకు హాజరయ్యారని తొలుత ప్రకటించిన టీజీపీఎస్సీ, తర్వాత ఆ సంఖ్య 10కి ఎలా చేరిందని నిలదీశారు. పరీక్ష నిర్వహణలో బయోమెట్రిక్ హాజరు విధానం అమలు చేసినా, అభ్యర్థుల హాజరు విషయంలో ఎందుకు వ్యత్యాసాలు వచ్చాయని ప్రశ్నించారు.

**మెయిన్స్ మూల్యాంకనంపై సందేహాలు**

గ్రూప్ 1 మెయిన్స్ జవాబుపత్రాల మూల్యాంకనంపైనా అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయని కవిత ఆ లేఖలో పేర్కొన్నారు. దేశంలోని ప్రముఖ వర్సిటీల ప్రొఫెసర్లతో మెయిన్స్ పరీక్షల వాల్యూయేషన్ చేయిస్తామని తొలుత టీజీపీఎస్సీ ప్రకటించిందని, కానీ రిటైర్డ్ ప్రొఫెసర్లతో మూల్యాంకనం చేయించడంపైనా అభ్యర్థుల్లో అనుమానాలు ఉన్నాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 45 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తామని ప్రకటించిన కమిషన్.. ఆ తర్వాత మాట మార్చి, ఒక సెంటర్‌ను పెంచిందని తెలిపారు. కేవలం రెండు పరీక్ష కేంద్రాల్లోనే మెయిన్స్ పరీక్షలకు హాజరైన, రెండు కోచింగ్ సెంటర్లకే చెందిన 71 మంది అభ్యర్థులు గ్రూప్ 1 ఉద్యోగాలకు అర్హత సాధించడం వెనుక ఏదో మతలబు ఉన్నదని అనుమానం వ్యక్తంచేశారు. అభ్యర్థుల ఆందోళన ధర్మబద్ధంగానే ఉన్నదని హైకోర్టు కూడా గుర్తించిందని, ఆ నియామకాలపై స్టే విధించిందని ఆమె పేర్కొన్నారు.

vishalabharathi Telugu Daily

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

శనివారం,
19.04.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



## వివాహేతర సంబంధం నేరం కాదు.. ఢిల్లీ హైకోర్టు సంచలన వ్యాఖ్యలు

విశాలభారతి, స్పోర్ట్స్ బ్యూరో: వివాహేతర సంబంధాన్ని నేరంగా చూడాల్సిన అవసరం లేదని, అది నైతికతకు సంబంధించిన అంశమంటూ గతంలో సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలను ఉదహరిస్తూ ఓ వ్యక్తి భార్య ప్రియుడికి ఢిల్లీ హైకోర్టు విముక్తి కలిగించింది. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాల్లోకి వెళ్తే.. తన భార్య మరో వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుందని, ఓ హోటల్‌లో వారిద్దరూ శారీరకంగా దగ్గరయ్యారని మహిళ భర్త ఆరోపిస్తూ కోర్టుకెక్కాడు. ఈ కేసులో మేజిస్ట్రేట్ కోర్టు ప్రియుడిని విడిచిపెట్టేసింది. దీంతో బాధిత భర్త సెషన్స్ కోర్టును ఆశ్రయించాడు. వాదనలు విన్న కోర్టు ప్రియుడికి సమన్లు పంపింది. దీనిని అతడు ఢిల్లీ హైకోర్టులో సవాలు చేశాడు. అక్కడ కూడా అతడికి అనుకూలంగానే తీర్పు వచ్చింది.ఈ సందర్భంగా కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. భార్యను భర్త ఆస్తిగా పరిగణించే మహాభారత కాలం నాటి భావజాలానికి కాలం చెల్లిందని పేర్కొంది. వివాహేతర సంబంధం నేరమంటూ ఐపీసీ 497 సెక్షన్ ఇచ్చిన నిర్వచనం రాజ్యాంగబద్ధం కాదని సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పును ఈ సందర్భంగా ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నీనా బన్సల్ కృష్ణ ఉటంకించారు. వివాహేతర సంబంధం నైతికతకు సంబంధించిన అంశమని, దానిని నేరంగా చూడటం సరికాదని స్పష్టం చేస్తూ భార్య ప్రియుడికి ఈ కేసు నుంచి విముక్తి కల్పించారు.

# తెలంగాణ నూతన సీఎస్ జయేశ్ రంజన్?

తరువాయి భాగం

చేయనున్నారని విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది.

నెలాఖరుకు శాంతికుమారి రిటైర్మెంట్

ప్రస్తుత ప్రధాన కార్యదర్శి శాంతికుమారి (1989 బ్యాచ్) ఈ నెలాఖరుకు పదవీ విరమణ చేయనున్నారు. ఆమె స్థానంలో నూతన ప్రధాన కార్యదర్శి నియామకం కోసం గత నెల రోజులుగా కసరత్తు జరుగుతున్నది. ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్న కె.రామకృష్ణారావు (1991 బ్యాచ్) పేరు దాదాపు ఖరారయ్యిందని గతంలో వార్తలు కూడా వచ్చాయి. ఆర్థిక శాఖలో విశేషమైన అనుభవం ఉన్న ఆయనను నియమించాలని సీఎం రేవంత్ రెడ్డి సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకున్నారని, ఈ నెలాఖరుకు శాంతికుమారి నుంచి పదవీ బాధ్యతలు తీసుకోనున్నారని సచివాలయ వర్గాలు అనుకుంటూ వచ్చాయి. ఈ తరుణంలో ఊహించని విధంగా రెండు పేర్లు తెరమీదకి వచ్చాయని తెలిసింది. రామకృష్ణారావు సర్వీసు ఆగస్టు 2025 కు పూర్తవుతుంది. ప్రధాన కార్యదర్శిగా నియమించినా నాలుగు నెలలకు మించి కొనసాగే పరిస్థితి లేదు. ఒకవేళ మరో మూడు నెలల పాటు సర్వీసు కొనసాగించాలని అనుకుంటే కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతి పొందాల్సి ఉంటుంది. రామకృష్ణారావు సర్వీసు పొడిగింపు కోసం సీఎం రేవంత్ రెడ్డి లేఖ రాసినా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పరిగణనలోకి తీసుకుంటారా? అనే సంశయం కూడా ఉంది. ఒకవేళ పొడిగింపు లేనట్లయితే ఆగస్టు నెలాఖరుకు రిటైర్ కావాల్సి ఉండటం ఆయనకు పెద్ద మైనస్‌గా మారిందని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. ఒకవేళ రామకృష్ణారావును ప్రధాన కార్యదర్శిగా ఎంపిక చేయని పక్షంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారుడిగా నియమించనున్నారని సమాచారం. నాలుగు నెలల కోసం రామకృష్ణారావును నియమించుకునే బదులు మరో ఇద్దరు సీనియర్ ఐఏఎస్ అధికారుల పేర్లు పరిశీలనకు వచ్చాయని తెలుస్తున్నది. అందులో ఒకరు జయేశ్ రంజన్ కాగా మరొకరు వికాస్ రాజ్. వీరిద్దరూ 1992 బ్యాచ్ అధికారులే కావడం గమనార్హం. జయేశ్ 2027 సెప్టెంబర్ నెలాఖరు వరకు సర్వీసులో ఉంటారు. వికాస్ రాజ్ 2028 మార్చి నెలాఖరుకు కొనసాగుతారు. జయేశ్.. ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ కమ్యునికేషన్ శాఖకు, వికాస్ రాజ్ ట్రాన్స్ పోర్ట్, రోడ్లు, భవనాల శాఖకు ప్రత్యేక ప్రధాన కార్యదర్శులుగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇద్దరూ బీహార్ రాష్ట్రానికి చెందిన అధికారులే కావడం గమనార్హం.

**కలిసొస్తున్న కుల గణన...**

కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా కుల గణన కోసం పోరాడుతున్నారు. తాము అధికారంలోకి రాగానే తెలంగాణలో కుల గణన చేస్తామని చెప్పారు. రాహుల్ ప్రకటన మేరకు సీఎం రేవంత్ రెడ్డి కుల గణన నిర్వహించి, బీసీ జానాభా లెక్కలు తేల్చారు. తెలంగాణలో బీసీ కులాల శాతం 56.6 శాతంగా ఉన్నట్లు ప్రకటించారు. కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం కుల గణన వివరాలను బహిర్గతం చేయడమే కాకుండా రెండు రోజుల క్రితం క్యాబినెట్ మీటింగ్‌లో ప్రవేశపెట్టింది. బీహార్‌కు చెందిన జయేశ్ రంజన్ బీసీ వర్గానికి చెందిన అధికారి కావడం ఆయనకు కలిసివచ్చే అవకాశంగా ఉందని విశ్వసనీయంగా తెలిసింది. వివాద రహితుడు, ఏ పార్టీ అధికారంలో ఆ పార్టీతో కలిసి పనిచేసే మనస్తత్వం ఉండటం కూడా కారణంగా చెబుతున్నారు. జయేశ్ రంజన్ పేరును ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కర్ణాటక రాష్ట్ర డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ సిఫారసు చేసినట్లు కాంగ్రెస్ వర్గాలు కూడా చర్చించుకుంటున్నాయి. తెలంగాణకు పెట్టుబడులు, ఆదాయం సమకూర్చడంలో ఆయనకు విశేష అనుభవం ఉందని, సర్వీసు కూడా రెండున్నర ఏళ్ల వరకు ఉన్నందున ఆయన పేరును ప్రతిపాదించారని సచివాలయంలో సీనియర్ అధికారి ఒకరు వెల్లడించారు. గత దశాబ్ద కాలం నుంచీ పరిశ్రమలు, ఐటీ శాఖల కార్యదర్శిగా పనిచేస్తున్నందున ఆయన వైపే కాంగ్రెస్ అధిష్ఠానం మొగ్గుచూపుతున్నట్లు తెలిసింది. రాష్ట్ర ప్రభుత్వ పెద్దలకు ఆదాయం పెద్ద సమస్యగా మారిన పరిస్థితుల నేపథ్యం కూడా కలిసివచ్చే అంశంగా చెప్పవచ్చని అంటున్నారు. అయితే.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేటీఆర్‌తో ఆయన సన్నిహితంగా మెలిగారనే అపవాదు ఉన్నది. ఇదేమైనా మైనస్‌గా మారుతుందా? అనే అనుమానాన్ని కూడా సదరు అధికారి వ్యక్తం చేశారు.

**పరిశీలనలో వికాస్ రాజ్ పేరు..**

బీహార్‌కు చెందిన మరో అధికారి వికాస్ రాజ్ పేరు కూడా కాంగ్రెస్ నాయకత్వం పరిగణనలోకి తీసుకుంటున్నదని సమాచారం. షెడ్యూల్ కులాలకు చెందిన వికాస్ రాజ్.. మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈవో)గా విధులు నిర్వర్తించారు. ఆ తరువాత ఆయనకు ప్రభుత్వంలో కీలకమైన బాధ్యతలు అప్పగించారు. అయితే జయేశ్ రంజన్‌కు ఉన్నంతగా చాకచక్యం లక్షణాలు వికాస్ రాజ్‌కు లేవని అంటున్నారు. పెట్టుబడులు, ఆదాయం తీసుకువచ్చే శక్తియుక్తులు లేవని చెబుతున్నారు. దీంతో అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆయనను ప్రధాన కార్యదర్శిగా నియమించే సూచనలు కన్పిస్తున్నాయని అంచనా వేస్తున్నారు. 2028 సంవత్సరం అక్టోబర్ లేదా నవంబర్ నెలలో రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. జయేశ్ పదవీ విరమణ తరువాత వికాస్ రాజ్‌ను నియమిస్తే.. 2028 మార్చి వరకు కొనసాగుతారు. మరో ఆరు నెలల పాటు కొనసాగిస్తే సెప్టెంబర్ 2028లో పదవీ విరమణ చేసే అవకాశం ఉంటుంది. ఎస్సీ వర్గానికి చెందిన అధికారిని ప్రధాన కార్యదర్శిగా నియమించామని కాంగ్రెస్ ప్రభుత్వానికి చెప్పుకొనే అవకాశం కూడా కలుగుతుంది. ఒకవేళ వికాస్ రాజ్ సర్వీసును కేంద్ర ప్రభుత్వం ఆరు నెలలు పొడిగించనట్లయితే.. బద్నాం చేసే ఆయుధం కూడా కాంగ్రెస్ ప్రభుత్వానికి లభిస్తుంది.



# హైదరాబాద్‌లో ఏఐ క్లస్టర్

తరువాయి భాగం

శక్తివంతమైన ఏఐ సూపర్ కంప్యూటింగ్ మౌలిక సదుపాయాలను సమకూర్చనుందని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. దేశంలో తెలంగాణను ఏఐ రాజధానిగా మార్చాలనే లక్ష్యానికి అనుగుణంగా ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకోనుందని పేర్కొంది. ఈ ప్రాజెక్టును అత్యున్నత ఎన్విరాన్‌మెంటల్, సోషల్, గవర్నెన్స్ (ఈఎస్‌జీ) ప్రమాణాలతో అభివృద్ధి చేయనున్నట్లు సీఎంవో వర్గాలు తెలిపాయి. ఈ క్యాంపస్ తెలంగాణలోని విద్యాసంస్థల భాగస్వామ్యంతో ఏఐ ప్రతిభను పెంపొందించనుందని.. రాష్ట్ర డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్‌కు దోహదపడుతుందని వివరించాయి.

**మూడో పరిశ్రమకు తోషిబా అనుబంధ సంస్థ ఓకే..**

హైదరాబాద్ శివార్లలోని రుద్రారంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల పరిశ్రమను విస్తరించేందుకు తోషిబా అనుబంధ సంస్థ ట్రాన్స్‌మిషన్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్స్ ఇండియా (టీటీడీఐ) ముందుకొచ్చింది. రూ. 562 కోట్ల మేర పెట్టుబడులు పెట్టేందుకు సీఎం సమక్షంలో అవగాహన ఒప్పందం చేసుకుంది. రుద్రారంలో సర్జ్ అరెస్టర్స్ తయారీ పరిశ్రమను ఏర్పాటు చేయడంతోపాటు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, గ్యాస్ ఇన్సులేటెడ్ స్విచ్‌గేర్ (జీఐఎస్) తయారీ సామర్థ్యాన్ని విస్తరించనున్నట్లు టీటీడీఐ సీఎండీ హిరోషి ఫురుటా సీఎం రేవంత్‌రెడ్డికి వివరించారు.ఇప్పటికే రెండు పరిశ్రమలకు తోడుగా అదనంగా ఇది మూడో పరిశ్రమ అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తోషిబా కార్పొరేషన్ ఎనర్జీ బిజినెస్ డైరెక్టర్ హిరోషి కనెటా, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, టీటీడీఐ సీఎండీ హిరోషి ఫురుటా పాల్గొన్నారు.

**మెరుగైన విధానాలతోనే భారీ పెట్టుబడులు: సీఎం**

తెలంగాణ భారీ పెట్టుబడులను సాధించడంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పారిశ్రామిక విధానాలు పెట్టుబడులను ఆకర్షిస్తున్నాయన్నారు. నమ్మకమైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా, సింగిల్ విండో అనుమతులను ప్రభుత్వం అందిస్తోందని చెప్పారు. రాష్ట్రంలో ప్రతిభావంతులైన నిపుణులు అందుబాటులో ఉండటంతో ఏఐ సంబంధిత డిజిటల్ సేవల్లో రాష్ట్రం అగ్రగామిగా నిలుస్తుందని సీఎం పేర్కొన్నారు. ఏడబ్ల్యూఎస్, ఎస్‌టీటీ, టిల్‌మన్ హోల్డింగ్స్, సీటీఆర్‌ఎల్‌ఎస్ వంటి పెద్ద కంపెనీల డేటా సెంటర్ ప్రాజెక్టుల వరుసలో ఎన్‌టీటీ భారీ పెట్టుబడుల ఒప్పందంతో దేశంలో ప్రముఖ డేటా సెంటర్ హబ్‌గా హైదరాబాద్ స్థానం మరింత బలపడిందని వ్యాఖ్యానించారు.

**రాష్ట్రంలో పెట్టుబడి పెట్టాలని వినతి..**

తెలంగాణ కొత్త రాష్ట్రమైనా వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రమని.. తమ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడం ద్వారా మరింత ఎదగాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జపాన్ పారిశ్రామికవేత్తలకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆయన టోక్యోలో జరిగిన 'ఇండియా-జపాన్ ఎకనామిక్ పార్టనర్‌ప్ రోడ్ షో'లో 150 మంది పారిశ్రామికవేత్తలతో మాట్లాడారు. 'టోక్యో గొప్ప నగరం. ఇక్కడి మౌలిక సదుపాయాలు, పర్యావరణ పరిరక్షణ, ఆవిష్కరణలు అద్భుతం. జపాన్ ప్రజలు సౌమ్యులు, మర్యాదస్తులు, క్రమశిక్షణగల వారు. హైదరాబాద్‌ను అభివృద్ధి చేయడానికి టోక్యో నుంచి చాలా నేర్చుకున్నా'అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు, ప్రతిభావంతులైన నిపుణులు, స్థిరమైన విధానాలను తమ ప్రజాప్రభుత్వం అందిస్తుందని జపాన్ వ్యాపారవేత్తలకు మాటిచ్చారు. లైఫ్ సైన్సెస్, గ్లోబల్ కేపబులిటీ సెంటర్లు, ఎలక్ట్రానిక్స్, విద్యుత్ వాహనాలు, టెక్స్‌టైల్స్, ఏఐ డేటా సెంటర్లు, లాజిస్టిక్స్ వంటి రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని కోరారు. ఈ సందర్భంగా తెలంగాణలో పెట్టుబడులు పెట్టడానికి ఉన్న సానుకూలతలను వాణిజ్య, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ పారిశ్రామికవేత్తలకు వివరించారు. సమావేశంలో భారత రాయబారి సిబి జార్జ్, జపాన్ ఎక్స్‌టర్నల్ ట్రేడ్ ఆర్గనైజేషన్ (జెట్రో) బెంగళూరు డైరెక్టర్ జనరల్ తోషిహిరో మిజుటానీ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఫ్యూచర్ సిటీ, మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుపై ప్రచార వీడియోలను రాష్ట్ర ప్రభుత్వం ఈ వేదికపై ప్రదర్శించింది. ఆ తర్వాత తెలంగాణ ప్రతినిధి బృందం జపాన్‌లోని పలు దిగ్గజ కంపెనీల ప్రతినిధులతో ముఖాముఖి సమావేశమైంది.

**రాష్ట్ర పారిశ్రామిక విధానాలతోనే భారీ పెట్టుబడులు**

తెలంగాణ భారీ పెట్టుబడులను సాధించడంపై సీఎం రేవంత్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పారిశ్రామిక విధానాలు పెట్టుబడులను ఆకర్షిస్తున్నాయన్నారు. నమ్మకమైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా, సింగిల్ విండో అనుమతులను ప్రభుత్వం అందిస్తోందని చెప్పారు. రాష్ట్రంలో ప్రతిభావంతులైన నిపుణులు అందుబాటులో ఉండటంతో ఏఐ సంబంధిత డిజిటల్ సేవల్లో రాష్ట్రం అగ్రగామిగా నిలుస్తుందని సీఎం పేర్కొన్నారు. ఏడబ్ల్యూఎస్, ఎస్‌టీటీ, టిల్‌మన్ హోల్డింగ్స్, సీటీఆర్‌ఎల్‌ఎస్ వంటి పెద్ద కంపెనీల డేటా సెంటర్ ప్రాజెక్టుల వరుసలో ఎన్‌టీటీ భారీ పెట్టుబడుల ఒప్పందంతో దేశంలో ప్రముఖ డేటా సెంటర్ హబ్‌గా హైదరాబాద్ స్థానం మరింత బలపడిందని వ్యాఖ్యానించారు.

# కిషన్‌రెడ్డీ.. రాష్ట్రానికి ఏం చేశావ్?

- మతం, ఒవైసీ జపం తప్ప అభివృద్ధి ఏది?
- మెట్రో విస్తరణ, విభజన హామీలు పట్టవా?
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ-బీఆర్ఎస్ కుమ్మక్కు
- పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్
- పార్టీ లైన్ దాటితే చర్యలు తప్పవు
- కాంగ్రెస్ నేతలకు వార్నింగ్

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

పాతికేళ్ల రాజకీయ ప్రస్థానంలో రెండుసార్లు కేంద్ర మంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి.. తెలంగాణకు ఏం చేశారని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ ప్రశ్నించారు. కనీసం అంబర్‌పేట నియోజకవర్గానికి ఏం చేశారో చెప్పాలన్నారు. గాంధీ భవన్‌లో శుక్రవారం మహేశ్‌గౌడ్ మీడియాతో మాట్లాడారు. బీజేపీకి మతం తప్ప.. అభివృద్ధి గురించి ధ్యాస లేదని, రజాకార్ల గురించి ఇంకెన్నాళ్లు మాట్లాడతారని ప్రశ్నించారు. పొద్దున లేస్తే ఒవైసీ జపం చేయడం కిషన్‌రెడ్డి అలియాస్ కిస్మత్‌రెడ్డికి అలవాటుగా మారిందని విమర్శించారు. గత జన్మలో వారు అన్నదమ్ములు అయి ఉండొచ్చని అన్నారు. హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలతో రజాకార్ల రాజ్యం ఎలా వస్తుందో కిషన్‌రెడ్డికే తెలియాలన్నారు. కేంద్ర మంత్రిగా ఉండి.. ఇంత దిగజారుడు వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు.

హైదరాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిచేందుకు అవసరమైన సంఖ్యా బలం లేకున్నా.. ఎవరి అండ చూసుకుని బీజేపీ పోటీ చేస్తోందని కిషన్‌రెడ్డిని ప్రశ్నించారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌తో ఒప్పందం చేసుకున్నది వాస్తవం కాదా..? అని నిలదీశారు. సబర్మతీ ప్రాజెక్టు గురించి మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి.. మూసీ సుందరీకరణకు ఎందుకు అడ్డుపడుతున్నారని ప్రశ్నించారు. మెట్రో విస్తరణ, విభజన హామీలూ ఆయనకు పట్టవన్నారు. కేంద్ర మంత్రి స్థాయిలో ఉన్న బండి సంజయ్ దిగజారుడు భాష మాట్లాడటం సరికాదన్నారు. బీసీల గురించి మాట్లాడే నైతిక హక్కు బీజేపీ నేతలకు లేదన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో సన్నబియ్యం పథకాన్ని అమలు చేసి.. అక్కడి రేషన్ షాపుల్లో ప్రధాని మోదీ ఫొటో పెట్టుకోవాలని మహేశ్ సూచించారు.

**పార్టీ లైన్ దాటితే చర్యలు తప్పవు..**

ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్ళాలని నేతలకు టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ సూచించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పార్టీ లైన్ దాటితే చర్యలు తప్పవని హెచ్చరించారు. శుక్రవారం గాంధీ భవన్ లో జహీరాబాద్, చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ సమీక్ష సమావేశం జరిగింది. ఏఐసీసీ ఇంచార్జీ మీనాక్షి నటరాజన్, ఏఐసీసీ కార్యదర్శులు విష్ణునాథ్, విశ్వనాథన్, మంత్రులు దామోదర రాజనర్సింహ, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, మాజీ మంత్రి గీతా రెడ్డి, ఎమ్మెల్యేలు, పోటీ చేసిన అభ్యర్థులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన మహేశ్



కుమార్ గౌడ్ అభివృద్ధి కార్యక్రమాల ప్రచారంపై వెనకబడి పోతున్నానమి నేతలను అప్రమత్తం చేశారు. ఏడాదిన్నర పాలనలో దేశ చరిత్రలో నిలిచిపోయే కుల గణన, ఎస్సీ వర్గీకరణ, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు, సన్న బియ్యం పంపిణీనిని మన ప్రభుత్వం తీసుకువచ్చిందని ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని సూచించారు. జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో తప్పక పాల్గొనాలన్నారు.

# సొంత గడ్డపై ఆర్సీబీకి మూడో ఓటమి

విశాలభారతి, స్పోర్ట్స్ బ్యూరో:

ఐపీఎల్ 18లో బయటి వేదికల్లో విజయాల మీద విజయాలు సాధిస్తున్న బెంగళూరు.. సొంతగడ్డపై మాత్రం తేలిపోతోంది. చిన్నస్వామి స్టేడియంలో ఆ జట్టు వరుసగా మూడో ఓటమి రుచి చూసింది. వర్షం వల్ల 14 ఓవర్లకు కుదించిన మ్యాచ్‌లో ఆర్సీబీ 5 వికెట్ల తేడాతో పరాజయం చవిచూసింది. యుజ్వేంద్ర చాహల్ (2/11), మార్కో యాన్సెన్ (2/10), అర్ష్‌దీప్ సింగ్ (2/23), హర్‌ప్రీత్ బ్రార్ (2/25) విజృంభించడంతో మొదట బెంగళూరు 9 వికెట్లకు 95 పరుగులే చేసింది. టిమ్ డేవిడ్ (50 నాటౌట్; 26 బంతుల్లో 5×4, 3×6) మెరుపుల్లేకుంటే బెంగళూరు పరిస్థితి ఘోరంగా ఉండేదే. అనంతరం హేజిల్‌వుడ్ (3/14), భువనేశ్వర్ (2/26) సత్తా చాటడంతో ఛేదనలో పంజాబ్ కూడా కష్టపడింది. అయితే నేహాల్ వధేరా (33 నాటౌట్; 19 బంతుల్లో 3×4, 3×6) కీలక ఇన్నింగ్స్‌తో జట్టును గెలిపించాడు.చిన్న లక్ష్యమే కదా.. పంజాబ్ విధ్వంసక ఓపెనర్లు ప్రభ్‌సిమ్రన్, ప్రియాంశ్ ఆర్యలే పని పూర్తి చేసేస్తారనుకుంటే.. ఛేదన అంత తేలిగ్గా సాగలేదు. వీళ్లిద్దరూ ఇన్నింగ్స్‌లను మెరుగ్గానే ఆరంభించినప్పటికీ పెద్ద స్కోర్లు చే



యలేకపోయారు. ఇలా షాట్లకు దిగారో లేదో అలా ఔటైపోయారు. ప్రభ్‌సిమ్రన్ (13)ను భువనేశ్వర్, ప్రియాంశ్ (16)ను హేజిల్‌వుడ్ పెవిలియన్ చేర్చారు. శ్రేయస్ అయ్యర్ (7), ఇంగ్లిస్ (14)లను సైతం హేజిల్‌వుడ్ ఎక్కువసేపు నిలవనీయలేదు. 8 ఓవర్లకు పంజాబ్ 53/4కు చేరుకుంది. బౌలింగ్‌కు అనుకూలిస్తున్న పిచ్‌పై 6 ఓవర్లలో 43 పరుగులు చేయాల్సి రావడంతో ఆర్సీబీలో ఆశలు చిగురించాయి. కానీ ఆరంభంలో కొంత ఇబ్బంది పడ్డ నేహాల్ వధేరా.. తర్వాత భారీ షాట్లు ఆడి బెంగళూరు ఆశలపై నీళ్లు చల్లాడు. మ్యాక్స్‌వెల్ స్థానంలో ఈ మ్యాచ్ ఆడిన స్టాయినిస్.. 13వ ఓవర్ తొలి బంతికి సిక్సర్ బాది మ్యాచ్‌ను ముగించాడు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
శనివారం,
19.04.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



vishalabharathi Telugu Daily

## ప్రతి రైతుకూ భూధార్ నంబర్

విశాలభారతి, స్టేట్ బ్యూరో: గతంలో బీఆర్ఎస్ శ్రేణుల కోసమే కేసీఆర్ ధరణి చట్టాన్ని తీసుకొచ్చారని రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. భూమితో సంబంధంలేని, గులాబీ చొక్కా వేసుకున్న వారికి పట్టాలు ఇచ్చి, రైతుబంధు పథకంతో లబ్ధి కలిగించారని ఆరోపించారు. ఖాస్తులో ఉన్న రైతులకు మాత్రం పట్టాలివ్వకుండా మోసం చేశారని, దాంతో వారి బతుకులు రోడ్డున పడ్డాయని తెలిపారు. ధరణి చట్టం పేదోడికి శత్రువుగా మారిందని, అందుకే తమ ప్రభుత్వం దానిని బంగాళాఖాతంలోకి విసిరేసి.. సామాన్య ప్రజలకు చుట్టంలా ఉండే భూభారతి చట్టాన్ని తెచ్చిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూభారతి చట్టం-2025పై శుక్రవారం ములుగు జిల్లా వెంకటాపూర్ మండల కేంద్రంలో, ఆదిలాబాద్ జిల్లా బోరజ్ మండలంలో పూసాయి గ్రామంలో నిర్వహించిన అవగాహన సదస్సులకు మంత్రి పొంగులేటి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత ప్రభుత్వం 18 లక్షల ఎకరాలను పార్టు బీలో పెండింగ్‌లో పెట్టిందని, దీంతో రాష్ట్ర వ్యాప్తంగా లక్షల మంది రైతులు భూ సమస్యల కోసం ప్రాణాలు తీసుకునే పరిస్థితి ఎదురైందని తెలిపారు. తమ ప్రభుత్వంలో తీసుకున్న నిర్ణయంలో తప్పు జరిగితే దానిని సరిదిద్దుకుంటామని, గత ప్రభుత్వంలో మాత్రం దొర ఒక్కసారి నిర్ణయం తీసుకుంటే వెనక్కి తగ్గేదే లేదన్నట్లు వ్యవహరించేవారని దుయ్యబట్టారు. భూభారతి సమస్యల పరిష్కారానికి త్వరలో టోల్ ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తెస్తామన్నారు. గిరిజన, గిరిజనేతరులుండే ప్రాంతాల్లో భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఓ కమిటీని నియమిస్తామని ప్రకటించారు.

GENERAL NEWS



# ముత్యంరాజు గురుస్వామికి ఘన సన్మానం

సూర్యాపేట,విశాలభారతి: పరుశరామ నిర్మితమైన శబరిమల అయ్యప్ప స్వామి దేవాలయం వద్ద అవార్డు అందుకున్న రంగు ముత్యరాజు గురుస్వామిని పలువురు శుక్రవారం ఘనంగా సన్మానించారు. పలువురికి విద్యాబుద్ధులు నేర్పించే ప్రభుత్వ ఉపాధ్యాయులు గురు భక్తి తో అయ్యప్ప స్వామి దీక్ష లో తాము ఎంచుకున్న గురుస్వామి రంగు ముత్యంరాజు కు పురస్కారం వచ్చిన సందర్భంగా సత్కరించి సన్మానించడం సూర్యాపేట పట్టణంలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో శుక్రవారం చోటుచేసుకుంది. సూర్యాపేట కు చెందిన సీనియర్ గురుస్వామి రంగు ఘనంగా సన్మానించారు. ముత్యం రాజు కు ఇటీవల శబరి మల అయ్యప్ప స్వామి సన్నిధి లో పరశురామ పురస్కారం వచ్చిన సందర్భంగా పలువురు ని పలువురు ప్రభుత్వ ఉపాధ్యాయులు సన్మానం చేశారు. కార్తిక మాసంలో అయ్యప్ప దీక్ష చేపట్టి గురు స్వామి ద్వారా దీక్ష పూర్తి చేసుకోవడం ఆనవాయితి అన్నారు. అవార్డు వచ్చిన సందర్బంగా నన్ను సన్మానించి నాపైన గురత్వర బాధ్యత ఉంచారాని, అయ్యప్ప స్వామి దీక్ష వ్యాప్తికి, స్వాములను సన్మార్గంలో నడిపించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమం లో అయ్యప్ప స్వామి దేవాలయం ఉపాధ్యక్షులు భూపతి శ్రీనివాస్ స్వామి, అఖిల భారతీయ ధర్మ ప్రచార సభ మాజీ జాతీయ కార్యదర్శి వంకాయలపాటి శంకర్ చౌదరి, ఉపాధ్యాయులు , కే రమేష్, గుణగంటి శ్రీనివాస్, జి లక్ష్మణ్ ముంతా శ్రీనివాస్, లిగాల రవి, చౌదరి రెడ్డి, కరుణాకర్, భాస్కర్,నాగయ్య, నిమ్మల శ్రీనివాస్, నాగయ్య, మొరిశెట్టి సత్యనారాయణ, యానాల సుధాకర్ రెడ్డి, తో పాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. సన్మానం కార్యక్రమం నకు ముందు ఆలయ అర్చకులురెంటల సతీష్ శర్మ, కోటి శర్మ లుప్రత్యేక పూజలు నిర్వహించి వేద ఆశీర్వాదం అందజేశారు.

# నకిలీ విత్తనాలు అమ్మితే పి.డి యాక్ట్ తప్పదు

- విత్తనాల కొనుగోలు విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలి.
- గుర్తింపు పొందిన కంపెనీ ప్యాకింగ్, లేబుల్ తనిఖీ చేసుకోవాలి.
- గ్రామాల్లోకి వచ్చి విడి విత్తనాలు అమ్మే వ్యాపారులను, మద్యవర్తులను నమ్మవద్దు.
- గుర్తింపు పొందిన విత్తన దుకాణాలు, వ్యాపారుల నుండి విత్తనాల కొనుగోలు చేయడం మేలు.
- కె. నరసింహ ఐపిఎస్ ఎస్పీ సూర్యాపేట జిల్లా.



సూర్యాపేట, విశాలభారతి: నకిలీ విత్తనాలు సరఫరా జరిగి రైతులు నష్టపోక ముందే అధికారులు ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలని, నకిలీ విత్తనాలు గుర్తించి సీజ్ చేయాలని, నకిలీ విత్తనాల వల్ల జిల్లాలో ఒక్క రైతు కూడా నష్టపోవద్దని జిల్లా ఎస్పీ కె. నరసింహ ఐపిఎస్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. సంభందిత అధికారులు అందరూ సమన్వయంగా పని చేసి రైతులకు నకిలీ వితనాలు సరఫరా జరగకుండా చూడాలని తెలిపారు. రాష్ట్రానికి, దేశానికి వ్యవసాయం ముఖ్యమైన ఆధారమని, అలాంటి వ్యవసాయం చేసే రైతులు ఆరుగాలం కష్టపడి నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత కూడా విత్తన సంస్థలు, డీలర్లు, వ్యాపారులపై పై ఉన్నదని వెల్ల డించారు. విత్తన వ్యాపార డీలర్స్ బాధ్యతగా మంచి నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయాలన్నారు. రైతులకు, వ్యవసాయానికి నష్టం కలిగేలా నకిలీ విత్తనాలు అమ్మితే అలాంటి వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పీడీ యాక్ట్ తప్పదని, సూర్యాపేట జిల్లా ఆంధ్రా ప్రాంతానికి ముఖ్య సరిహద్దుగా ఉన్నందున ఇక్కడ నకిలీ విత్తనాలు ఎక్కువగా సరఫరా అయ్యే అవకాశం ఉన్నదని తెలిపారు. ముందస్తు తనిఖీలు, రైతులకు అవగాహన కల్పించడం, డీలర్స్ కు అవగాహన కల్పించడం, సరిహద్దు లలో పటిష్టమైన నిఘా తో నకిలీ విత్తనాలు నివారించాలని పేర్కొన్నారు. రైతులతో సమావేశాలు నిర్వహించి చైతన్య పరచాలని, గతంలో నకిలీ విత్తనాల కేసుల్లో సంబంధం ఉన్నవారి పై నిఘా ఉంచాలని ఆదేశించారు. రైతులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. నాణ్యమైన కంపెనీ విత్తనాలు ఎంచుకోవాలని, లేబుళ్లు, ప్యాకింగ్ లేని విత్తనాలు కొనుగోలు చేయవద్దని కోరారు. తక్కువ ధరకు వస్తున్నాయని గ్రామాల్లోకి వచ్చే మద్యవర్తుల వద్ద విడి విత్తనాలు కొనుగోలు చేయవద్దని, ప్రభుత్వ గుర్తింపు పొందిన డీలర్స్ నుండి విత్తనాలు కొనుగోలు చేస్తే మంచిదని తెలిపారు. ఇతర రాష్ట్రాల నుండి జిల్లాల లనుండి ఎక్కువ మొత్తంలో విత్తనాలు కొనుగోలు చేసే రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు తీసుకోవాలని సూచించారు. నకిలీ విత్తనాల గురించి, అనుమానిత బ్రోకర్లు, డీలర్లను గురించి పోలీసు వారికి, వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు.





# ముస్లింలను ఆర్థికంగా దెబ్బతీయడానికే వక్ఫ్ బిల్లు

- వక్ఫ్ సవరణ బిల్లు రాజ్యాంగ విరుద్ధం
- కేంద్రం తన నిరంకుశ వైఖరి మార్చుకోవాలి
- వక్ఫ్ ఆస్తులను దోచుకోవాలని బీజేపీ కుట్ర
- అమనగల్లులో వక్ఫ్ బచావో శాంతియుత ర్యాలీ.

ఆమనగల్లు,విశాలభారతి: బీజేపీ వక్ఫ్ ఆస్తులను దోచుకోవాలని కుట్ర చేస్తోందని, ముస్లింలను ఆర్థికంగా దెబ్బ తీయడానికే బిల్లు తెచ్చిందని అమనగల్లు ముస్లిం జేఏసి నాయకులు ఆరోపించారు. పేద ముస్లింలకు దక్కాల్సిన వక్ఫ్ బోర్డు ఆస్తులను పెట్టుబడిదారుల కట్టబడేందుకు కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ బిల్లును తెరపైకి తీసుకువచ్చి పార్లమెంట్ లోఆమోదింపజేసిందని వెంటనే వక్ఫ్ బిల్లును రద్దు చేయాలని వక్ఫ్ బచావో శాంతియుత ర్యాలీ చేపట్టారు. శుక్రవారం ప్రార్ధనల అనంతరం కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వ తీరును నిరసిస్తూ అమనగల్లు పట్టణంలోని జామా మసీదు నుండి వక్ఫ్ బచావో అంటూ ముస్లీం మత గురువులు,యువకులు పెద్దఎత్తున నిరసన ర్యాలీ నిర్వహించారు. పార్లమెంట్ లో ఆమోదం పొందిన వక్ఫ్ బిల్లును కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎన్డీఏ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వక్ఫ్ బిల్లు ఆమోదం పొందడం వల్ల మత స్వేచ్ఛ సమానత్వానికి హామీ ఇచ్చే రాజ్యాంగంలోని 14,25, 26 ఆర్టికల్స్ ఉల్లంఘనతో పాటు మతపరమైన స్వేచ్ఛలో జోక్యం చేసుకోవడం ముస్లీంల రాజ్యాంగ హక్కులను ఉల్లంఘించడమే అవుతుందన్నారు.వక్ఫ్ బిల్లు చట్టరూపందాల్చినట్లయితేమసీదులు ,ఈద్గాలు,దర్గాలు,అషూర్ ఖానాలు,స్మశాన వాటికలు వంటి మతపరపైన ప్రదేశాలతో సహా వక్ఫ్ ఆస్తులకు తీవ్ర ముప్పు ఏర్పడుతుందని,కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం వక్ఫ్ బోర్డుల అధికారాన్ని నిర్వీర్యం చేయడంతో వక్ఫ్ ఆస్తులను కబ్జాదారులకు రెగ్యులర్ చేసుకోవడానికి మార్గం సుగమం చేస్తుందని మండిపడ్డారు.వక్ఫ్ బిల్లును ప్రస్తుత ప్రతిపక్ష ఇండియాకూటమినేతలు,ముస్లీం పర్సనల్ లా బోర్డుతో పాటు దేశంలోని వివిధ ముస్లీం సంఘాలు,ప్రజా మేధావి సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయన్నారు. పార్లమెంట్ లో ఆమోద ముద్రపడ్డ వక్ఫ్ బిల్లును కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.వర్ఫ్ సవరణ బిల్లు రాజ్యాంగ విరుద్ధమని, కేంద్రం తన నిరంకుశ వైఖరి మార్చుకోవాలన్నారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రాన్ని అందజేశారు.



# సూర్యాపేట లో పోలీస్ ల విస్తృత తనిఖీలు

- శాంతిభద్రత పరిరక్షణలో ప్రజలు సహకరించాలి.
- పట్టణ ఇన్స్పెక్టర్ వీర రాఘవులు.
- తనిఖీల్లో పాల్గొన్న డాగ్ స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్ సిబ్బంది, స్పెషల్ పార్టీ పోలీస్

సూర్యాపేట, విశాలభారతి: అక్రమ రవాణా నిరోధించడంలో భాగంగా జిల్లా ఎస్పీ నరసింహ ఆదేశాల మేరకు శుక్రవారం సూర్యాపేట పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో కొత్త బస్టాండ్, హైటెక్ బస్టాండ్ ప్రాంగణాలలో, రద్దీ ప్రాంతాలు, ఫ్లై ఓవర్స్, ముఖ్యమైన వాణిజ్య సముదాయాలలో పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. బస్సులు నిలుపు ప్రాంగణాలను, దుకాణాలు బస్సులు, ప్రయాణికుల లగేజీ అనుమానిత వ్యక్తులను తనిఖీ చేశారు. ప్రయాణికులతో మాట్లాడి భద్రతా చర్యల పట్ల పట్టణ సీఐ వీర రాఘవులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పట్టణ ఇన్స్పెక్టర్ వీర రాఘవులు మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాలని కలుపుతూ ప్రధాన జాతీయ రహదారిపై రవాణా పరంగా ముఖ్య కేంద్రంగా ఉన్న సూర్యాపేట పట్టణంలో మెరుగైన భద్రత కల్పించడం, డ్రగ్స్, గంజాయి లాంటి మాదకద్రవ్యాలు, నిషేధిత పదార్థాల అక్రమ రవాణా నిరోధించడం, కొత్త వ్యక్తుల కదలికలు గుర్తించడం లో భాగంగా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించామని అన్నారు. గుర్తింపు నిర్ధారణ లేని వ్యక్తులకు, అనుమానితులు లాడ్జ్ ల నందు వసతి ఇవ్వవద్దు అని కోరారు. శాంతిభద్రతల రక్షణలో ప్రజలు పోలీసులతో సహకరించాలి అని కోరారు. గంజాయి డ్రగ్స్ లాంటి పదార్థాలు అక్రమ రవాణా జరగకుండా తనిఖీలు చేశామన్నారు. మాదకద్రవ్యాలు గుర్తించే డాగ్, పేలుడు పరదర్ధాలు గుర్తించే డాగ్, బాంబ్ స్క్వాడ్ సిబ్బంది పాల్గొని బస్సులు, అనుమానిత వస్తువులు, ప్రయాణికుల బ్యాగులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఎస్ఐ ఆంజనేయులు,ఆర్ ఎస్ఐ మహేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



# ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది

- తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి

మద్దిరాల,విశాలభారతి: గోరెంట్ల, చౌవుళ్ళ తండా గ్రామాలలో పిఏసిఎస్ ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన దాన్యం కోనుగోలు కేంద్రము ప్రారంభించిన తుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు 17% తేమ వచ్చే విధంగా ఆరబెట్టుకుని కేంద్రాలకు తీసుకోవాల్సిన ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ఏ గ్రేడ్ ధాన్యానికి 2320 రూపాయలు బిగ్రేడ్ ధాన్యానికి 2300 రూపాయలు సన్నబడ్డకు అదనంగా బోనస్ 500 రూపాయలు ఇస్తుందని నాణ్యమైన ధాన్యమును తీసుకొచ్చి ప్రభుత్వం మద్దతు ధర పొందాలని దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ చైర్మన్ నాగం జయసుధసుధాకర్ రెడ్డి,మండల కాంగ్రెస్ అధ్యక్షులు ముక్కాల అవిలమల్లు నూతనకల్ పిఏసిఎస్ సీఈవో సమ్మెటి వెంకన్న,పిఏసిఎస్ డైరెక్టర్ మద్ది సంజీవ రెడ్డి,మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి సురేష్ గౌడ్, గోరంట్ల గ్రామ శాఖ అధ్యక్షుడు కంట్లము, చావుళ్ళ తండా గ్రామ శాఖ అధ్యక్షుడు సీతారామ్ నాయక్, అంగిరేకుల రామ్మూర్తి యాదవ్, ఛత్రు నాయక్, కాంగ్రెస్ నాయకులు బండపల్లి సాగర్ అశోక్ యాదవ్, బంటు బద్రి,మల్లయ్య, రమేష్, దామర్ల సోమయ్య, మరికంటి మైసయ్య,మరికంటి అశోక్ బండపల్లి మహేష్, బయ్య గణేష్, జటంగి గణేష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు





# భక్తి శ్రద్ధలతో గుడ్ ఫ్రైడే

- యేసుక్రీస్తు చేసిన త్యాగాన్ని స్మరిస్తూ సిలువ మార్గంలో పాల్గొన్న క్రైస్తవులు

మునుగోడు, విశాలభారతి: మండలంలోని పలు చర్చిలలో గుడ్ ఫ్రైడే ను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కమ్మగూడెంలో మొదటగా ఉదయం గ్రామ పురవీధులలో యేసుక్రీస్తు చేసిన త్యాగాన్ని స్మరిస్తూ సిలువ మార్గాన్ని నిర్వహించారు. యేసు నామకరణ దేవాలయంలో ఫాదర్ ధనరాజ్ మాట్లాడుతూ కరుణామయుడైన యేసు ప్రభు జీవితం త్యాగానికి చిహ్నం అని అన్నారు. మానవాళి పట్ల ప్రేమ, నిస్సహాయుల పట్ల కరుణ, శత్రువుల పట్ల క్షమ, ఆకాశమంతటి సహనం, అవధులు లేని త్యాగం ఇవన్నీ తన జీవితం,బోధనల ద్వారా జీసస్ లోకానికి ఇచ్చిన సందేశాలని పేర్కొన్నారు. 40 రోజుల ఉపవాస దీక్ష ను విరమింప చేసుకుంటున్న సందర్భంగా దేవాలయంలో అల్పాహార విందును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మత పెద్దలు గ్రామ కతోలికులు పాల్గొన్నారు.

# వాట్సాప్ వేదిక గా

- 25 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వపు విద్యార్థులు

ఆమనగల్లు,విశాలభారతి : ఆనందం, ఉద్వేగం,ఆప్యాయత పలకరింపులు చిన్ననాటి జ్ఞాపకాలు చిలిపి ముచ్చట్లు సెల్ఫీలు మధురమైన జ్ఞాపకాలతో ఆ ప్రాంతమంతా సందడిగా నెలకొంది. 25 ఏళ్ల తర్వాత బాల్యమిత్రులు ఒకచోట కలుసుకోవడం చెప్పుకోలేని మధుర అనుభవం. 25 ఏళ్ల తర్వాత వాట్సప్ వేదిక పుణ్యమా అని బాల్య స్నేహితులు ఒక్కటయ్యారు. ఆమనగల్లు పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పదోవ తరగతి 20002001బ్యాచ్ విద్యార్థులు 25 సంవత్సరాల తర్వాత శుక్రవారం ఆత్మీయ పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమం జరుపుకొన్నారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మి ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన అనంతరం ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకోవడంతో వారి సంతోషాలకు అవధులు లేకుండా పోయాయి .ఈ సందర్భంగా విద్యార్థులు అప్పటి తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకొని ఆత్మీయంగా పలుకరించుకున్నారు. పదో తరగతి పూర్తి చేసిన తర్వాత ఉన్నత చదువుల కోసం దూరమయ్యారు. మళ్లీ ఇన్నేండ్ల తర్వాత కలుసుకున్నారు. ఆ పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించి, అలనాటి స్మృతులను నెమరేసుకుంటూ ఒకరిని ఒకరు ఆటపట్టిస్తూ యోగక్షేమాలు తెలుసుకుంటూ రోజంతా సరదాగా గడిపారు.పలువురు పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ, రెండు దశాబ్దాలు గడిచిన అందరు స్నేహితులు కలువాలనే ఉద్దేశంతో ఆత్మీయ సమ్మేళన వేదిక ఏర్పాటు చేసినట్లు విద్యార్థులు తెలిపారు. 25 సంవత్సరాల క్రితం పదవ తరగతి పరీక్షలు వ్రాసి కొందరు పై చదువుల కొరకు వేరువేరు పట్టణాలకు, మరికొందరు జీవనాధారం కోసం ఏదో పని చేసుకుని జీవనం సాగిస్తున్నారు. కొందరు ఉన్నత విద్యను అభ్యసించి మంచి ఉద్యోగం చేస్తున్నారు.చాలా సంవత్సరాల తర్వాత దాదాపు అందరూ స్నేహితులు కలవడం చాలా ఆనందంగా ఉందని పూర్వ విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం ఆనాటి గురువులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాడు బోధించిన ఉపాధ్యాయులు అనంతరెడ్డి, బాలబ్రహ్మం, ఎలిజాబేత్, శోభారాణి, శ్యామలదేవి బుచ్చమ్మ, పద్మ హాజరై పూర్వ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు.



vishalabharathi Telugu Daily

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

శనివారం,
19.04.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com





# శాంతినగర్ కాలనీ కృపా నిరీక్షణ మినిస్ట్రీస్ లో ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు

**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:**

పెద్ద అంబర్పేట్ 4వ వార్డు పరిధి శాంతి నగర్ కాలనీలోని కృపా నిరీక్షణ మినిస్ట్రీస్ లో శుక్రవారం గుడ్ ఫ్రైడే వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు, ఆరాధన నిర్వహించారు. క్రీస్తు మరణాన్ని గుర్తు చేసుకుంటూ చర్చిలో ప్రార్థనలతో గంటలు మోగించారు.సంఘ సభ్యులు ఏసుక్రీస్తు కల్వరి సిలువలో పలికిన ఏడు మాటలను చదివి వినిపించారు. ఈ సందర్భంగా పాస్టర్ సిల్వధర్ గుడ్ ఫ్రైడే విశిష్టతను వివరించారు. పాస్టర్ సిల్వధర్ మాట్లాడుతూ.. మానవుల పాప విముక్తి కోసం ఏసుక్రీస్తు కల్వరి సిలువలో రక్తం కార్చి మృతి చెందారన్నారు. లోకంలో ఎవరూ చేయని త్యాగాన్ని ఆయన చేశారన్నారు. ఆయన త్యాగాన్ని ప్రతి ఒక్కరు గుర్తించాలన్నారు. క్రీస్తు సిలువలో పలికిన ఏడు మాటలు క్రైస్తవ మార్గంలో నడుస్తున్న వారికి ఎన్నో ఆధ్యాత్మిక సత్యాలను నేర్పిస్తాయని పాస్టర్ సిల్వధర్ అన్నారు. ప్రతి ఒక్కరూ సత్య మార్గాన్ని అలవర్చుకోవాలన్నారు. తల్లిదండ్రుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. మనిషి చనిపోయేంత వరకు ఏసుప్రభువు బోధనలను స్మరించుకుంటూ సమాజానికి, ప్రజలకు ఎలా ఉపయోగకరంగా ఉండాలో పాస్టర్ సిల్వధర్ తెలియజేశారు. ప్రతి ఒక్కరి పట్ల ప్రేమ, కరుణ, సాదరభావం కలిగి ఉండాలని ఏసుక్రీస్తు చూపిన మార్గాన్ని అందరూ అనుసరించాలని ఆయన అన్నారు. ప్రార్థనల అనంతరం క్రైస్తవ సోదర, సోదరీమణులు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు, సభ్యులు, యూత్ సభ్యులు, మహిళలు, పిల్లలు, స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# గుడ్ ఫ్రైడే సందర్భంగా క్రాస్ ర్యాలీ

- మానవాళి మనుగడ కోసం క్రీస్తు శిలువమరణం

**కూకట్ పల్లి, విశాలభారతి:**

గుడ్ ఫ్రైడేను పురసరించుకొని శుక్రవారం సనత్ నగర్ లో క్రైస్తవులు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలతో నిర్వహించారు. ఈ సందర్భంగా సనత్ నగర్ క్రిస్టియన్ యూత్ ఆధ్వర్యంలో గుడ్ ఫ్రైడే సందర్భంగా క్రాస్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్.బి. ఇమ్మానుయేల్ చర్చ్ పాస్టర్ రేవ్. ఎ. శ్రీనివాస్ దైవ ప్రార్థనాల నడుమ కార్యక్రమం ప్రారంభమైంది. గుడ్ ఫ్రైడే సందర్భంగా మానవాళి మనుగడ కోసం క్రీస్తు శిలువ మరణం పొందిన రోజును పురస్కరించుకుని క్రీస్తు శ్రమ, కష్టాలను గుర్తుకు తెచ్చుకుని ప్రార్థనలు నిర్వహించి యేసుక్రీస్తు స్మరించుకున్నారు. యేసుక్రీస్తు తెలిపిన ప్రేమ, దయ, జాలి, కృప, కరుణ యేసుక్రీస్తు మానవాళికి అందించిన సందేశాలుగా పాస్టర్ రేవ్. శ్రీనివాస్ పేర్కొన్నారు. మానవాళి మనుగడ కోసం యేసుక్రీస్తు సిలువ మరణం పొంది తిరిగి లేచిన కథాంశంతో నిర్వహించిన క్రాస్ ర్యాలీ స్థానికులను ఆకట్టుకుంది. స్థానిక ఎమ్.బి. ఇమ్మానుయేల్ చర్చ్ నుంచి ప్రారంభమైన ర్యాలీ సనత్ నగర్ పుర వీధుల మీదుగా కొనసాగింది.ఈ కార్యక్రమంలో సనత్ నగర్ డివిజన్ లోని మెథడిస్ట్ చర్చ్, బాప్టిస్ట్ చర్చ్, సిఎస్ఐ చర్చ్, ఇండిపెండెంట్ యునైటెడ్ చర్చ్, సియన్ చర్చ్, బెతేల్ ప్రేయర్ హౌస్ సంఘ సభ్యులు, క్రైస్తవులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం పాస్టర్. కెజె క్లెమెంట్, ఎం. గెర్షోన్ ప్రకాష్, జోవార్ కెన్నెడీ, రాజగోపాల్, కె.సి. నిస్సి జోష్వా, కె. సనీల్, రాజ్ గోపాల్, బిజి విలియం తదితరుల పర్యవేక్షణలో కొనసాగింది.

## ఢిల్లీలో ఈ నెల 22 నుంచి 'దేవి' బస్సులు

దేశ రాజధాని ఢిల్లీలో ప్రజా రవాణా వ్యవస్థను మెరుగుపరిచేందుకు, ప్రభుత్వం 'మొహల్లా ఎలక్ట్రిక్ బస్ సర్వీస్'ను ప్రారంభించనుంది. అధికారికంగా 'ఢిల్లీ ఎలక్ట్రిక్ వెహికల్ ఇంటర్‌చేంజెస్' (DEVI - దేవి)గా పిలిచే ఈ సేవలు ఏప్రిల్ 22, 2025న మొదలవుతాయని నివేదికలు తెలుపుతున్నాయి. మెట్రో స్టేషన్ల నుంచి నివాస ప్రాంతాలకు చివరి మైలు కనెక్టివిటీని సులభతరం చేయడమే ఈ పథకం ప్రధాన లక్ష్యం. తొలి దశలో, 9 మీటర్ల పొడవు గల 255 చిన్న ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెడతారు. ఇరుకైన వీధులు, రద్దీ ప్రాంతాల్లో సులభంగా ప్రయాణించేలా వీటిని రూపొందించారు. ప్రతి బస్సులో 23 సీట్లు ఉంటాయి. ఒక్కసారి ఛార్జ్ చేస్తే 200 కిలోమీటర్లకు పైగా ప్రయాణిస్తాయి. ప్రస్తుతం నడుస్తున్న ఏసీ బస్సుల మాదిరిగానే ఛార్జీలు రూ.10 నుంచి రూ.25 మధ్య ఉంటాయి. మహిళల కోసం ప్రతి బస్సులో 6 సీట్లు కేటాయించారు. అంతేకాకుండా, ఢిల్లీ ప్రభుత్వ 'పింక్ పాస్' పథకం కింద మహిళలు ఈ బస్సులలో పూర్తిగా ఉచితంగా ప్రయాణించవచ్చు. మొదటి రూట్ (MS-1) అక్షరధామ్ మెట్రో స్టేషన్ నుంచి మయూర్ విహార్ ఫేజ్-3 వరకు, త్రిలోక్‌పురి, కళ్యాణ్‌పురి మీదుగా నడుస్తుంది. 2025 చివరి నాటికి 2,000కు పైగా బస్సులను అందుబాటులోకి తేవాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.పర్యావరణ హితమైన, సుస్థిరమైన రవాణా వ్యవస్థను బలోపేతం చేయడం, కాలుష్యం తగ్గించడం ఈ పథకం ముఖ్య ఉద్దేశ్యాలు.

# అవినీతికి ప్లాన్...?

- సీజ్ చేసిన భవనాల్లో స్పీడ్ అందుకున్న పనులు
- సర్కిల్ 20 లో అడ్డగోలుగా అక్రమ కట్టడాలు
- సీజ్ చేస్తున్నా.. కొనసాగుతున్న నిర్మాణాలు
- చెయ్యి తడిపితే చాలు..అక్రమం.. సక్రమమే
- జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్‌లో దందా
- కండ్లు మూసుకున్న అధికారులు..



వినతి పత్రం

తేదీ:17-04-2025

శ్రీయుత గౌరవనీయులైన జోనల్ కమిషనర్ శేరిలింగంపల్లి గారికి

మీ
మిద్దెల మల్లారెడ్డి
ప్రజల కోసం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు

**విశాలభారతి కథనానికి గురువారం జోనల్ కమిషనర్ కు ఫిర్యాదు చేసిన మిద్దెల మల్లారెడ్డి**




**విశాల భారతిలో గురువారం ప్రచురితమైన కథనం**

**శేరిలింగంపల్లి - విశాల భారతి**

అక్రమ నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం..నిబంధనలు అతిక్రమించి నిర్మిస్తే.. నోటీసులు ఇచ్చి నేలమట్టం చేస్తాం..ఇది బల్దియా యంత్రాంగం చెప్పే మాట.. కానీ ఆ మాటలు..చేతల వరకు రావడం లేదు. 'మూటలు' అందితే చాలు.. అక్రమమైనా..సక్రమమైపోతున్నాయి.. శేరిలింగంపల్లి సర్కిల్ 20 పరిధిలో అడ్డగోలుగా అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయి. ఎవరైనా ఫిర్యాదు చేస్తే..నోటీసులు ఇవ్వడం.. సీజ్ చేయడం చేస్తున్నా.. చర్యల విషయానికి వచ్చే సరికి టౌన్‌ప్లానింగ్ అధికారులు మిన్నకుండిపోతున్నారు.ఇక్కడ సీన్ కట్ చేస్తే.. సదరు సీజ్ అయిన భవనంలో యజమాని మిగిలిన పనులన్నీ చకచకా కానిచేస్తున్నాడు. ఈ వ్యవహారంలో 'చేతివాటం' గట్టిగా పనిచేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**ఎన్‌ఫోర్స్ ఎక్కడ..?**

అనుమతులకు విరుద్ధంగా సెల్లార్లు, అదనపు అంతస్తులు నిర్మిస్తున్నా.. అధికారులు అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. ఫిర్యాదు చేసినా..ఒత్తిడి తెచ్చినా.. కేవలం నోటీసులతో సరిపెడుతున్నారు. నోటీసు అందుకునే నిర్మాణదారుడు డబ్బులిస్తే చాలు ..ఆ నిర్మాణం జోలికి వెళ్లడం లేదు. అదేమని అడిగితే సరైన ఎన్‌ఫోర్స్‌మెంట్ లేదని.. స్థానిక టౌన్ ప్లానింగ్ అధికారులు సమాధానమిస్తున్నారు. ఒక నిర్మాణం రాత్రి రాత్రే జరగదు. రోజుల తరబడి ఉంటుంది. ముడుపుల మత్తులో పడి నిబంధనలకు టౌన్ ప్లానింగ్ అధికారులు పాతర వేస్తున్నారు. ఇదిలా ఉంటే నోటీసులు ఇచ్చిన నిర్మాణాల జోలికి వెళ్లకపోవడం మరింత విమర్శలకు తావిస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే టౌన్‌ప్లానింగ్ అధికారుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇష్టారాజ్యంగా అనుమతులు ఇస్తున్నారని, అక్రమ నిర్మాణాలను కట్టడి చేయాలని ఆదేశాలు జారీ చేసినా.. ఉన్నతాధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు.స్థానికంగా జీ+4 అంతస్తుల నిర్మాణాలు జరిగే చోట అడ్డగోలుగా 6 నుంచి 7 అంతస్తుల భారీ నిర్మాణాలు నిర్మిస్తున్నారు.సెట్ బ్యాక్ నిబంధనలు పాటించకుండా ప్రమాదకర స్థాయిలో నిర్మాణాలు జరుగుతున్నాయి.సామాన్యుడు చిన్నగా సెట్ బ్యాక్ ఉల్లంఘన చేస్తే.. చర్యలు తీసుకునే అధికారులు.. బడా నిర్మాణదారుల జోలికి మాత్రం వెళ్లడం లేదు. అక్రమ నిర్మాణాలతో ఇబ్బందులు పడుతున్నామని ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన బాధితులకు భరోసా దక్కడం లేదు.

**ఫైల్స్ తెచ్చుకోండి చేసి పెడతా..**

విశాల భారతి దినపత్రిక లో గురువారం ఇల్లీగల్ కాన్స్ట్రక్షన్స్ ఎట్ కేరాఫ్ కొండాపూర్ శ్రీరామ్ నగర్ అనే ప్రచురితమైన కథనానికి సర్కిల్ 20 టౌన్ ప్లానింగ్ సిటీ ప్లానర్ వెంకటరమణను వివరణ కోరగా.. అవన్నీ తర్వాత చూద్దాం లెండి.. మీకేమైన ఫైల్స్ ఉంటే తెచ్చుకోండి..పని చేసుకొని వెళ్లండి అంటూ..విశాల భారతి విలేకరి తో బేరసారాలు చేయడం కొసమెరుపు. ఇంకాస్త అత్యుత్సాహంతో మీకు ఏమైనా కావాలంటే మా టౌన్ ప్లానింగ్ సిబ్బంది మల్లేష్ మీకు అందుబాటులోకి వస్తాడు.అతనితో మాట్లాడండి. మీరు ఎక్కడ ఉంటే అక్కడికి అతనే వస్తాడు మీకు కావాల్సింది సెటిల్ చేస్తాడు అని సమాధానం ఇచ్చారు. దీన్ని బట్టి ఏసిపి అధికారికి విధుల పట్ల గౌరవం లేదు సరికదా కేవలం అక్రమార్జనే పరమావధిగా పెట్టుకొని తన విధులు నిర్వర్తిస్తున్నట్లు స్పష్టమవుతుంది. ప్రభుత్వ ప్రతినిధిగా, బాధ్యతయుతమైన ఉద్యోగిగా తన విధుల పట్ల చిత్తశుద్ధితో పని చేయాలే కానీ ఎవరు ఫిర్యాదు చేస్తే వారికి భేరాసారాలతో దారికి తెచ్చుకోవాలనుకోవడం అతని దిగజారుడుతనానికి అద్దం పడుతుందని విమర్శలు వెలువెత్తుతున్నాయి.కేవలం అక్రమార్జన ధ్యేయంగా పనిచేస్తున్న ఏసిపి వెంకటరమణ పై ఉన్నత స్థాయి అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు.

**ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన బుట్ట దాఖలు..?**

ఎలాంటి సమస్యలకైనా పరిష్కారం లభిస్తుందని ఎంతో ఆశగా వచ్చే ఫిర్యాదుదారులకు ప్రజావాణిలో సైతం సమస్యలు పరిష్కారమవుకపోగా ప్రజావాణి కార్యక్రమం అభాస పాలవుతుందని ఫిర్యాదుదారులు విమర్శిస్తున్నారు. బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు మిద్దెల మల్లారెడ్డి ఫిబ్రవరి 3వ తేదీన శ్రీరామ్ నగర్ కాలనీ సి బ్లాక్ లో ప్లాట్ నెంబర్ 432 పై సదురు భవన యజమాని అక్రమ నిర్మాణం చేపడుతున్నట్లు ప్రజావణిలో ఫిర్యాదు చేశారు.ఫిర్యాదు చేసి నెలలు గడుస్తున్న ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదని వాపోయారు. అక్రమాలపై ఫిర్యాదు చేసిన సంబంధిత శాఖల అధికారులు ఇప్పటివరకు అటువైపు కనీసం తొంగి చూసిన దాఖలాలు లేవని ఇలా విధుల పట్ల అలసత్వం వహించే అధికారులకు ఉన్నత స్థాయి అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు.

# గావ్ ఛలో.. బస్తీ ఛలో



- కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్ రెడ్డి

**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:**

భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు అటల్ బిహారీ వాజ్పేయి శతజయంతి ఉత్సవాలో భాగంగా హయత్ నగర్ బిజెపి డివిజన్ అధ్యక్షులు గంగాని శ్రీను ఆధ్వర్యంలో నిర్వహించిన గావ్ ఛలో.. బస్తీ ఛలో.. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా స్థానిక డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పలువురు కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులను హయత్ నగర్ అనుమగల్ లోని దళిత సంఘాల పెద్దలను వారు శాలువతో సత్కరించి, పేద మధ్యతరగతి కుటుంబాల కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు పథకాలను వారికి వివరించి అర్హులైన ప్రతి ఒక్కరు కేంద్ర ప్రభుత్వ పథకలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు,దేశం కోసం ప్రజల కోసం గత 11 సంవత్సరాలుగా నరేంద్ర మోడీ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న సాహోసో పేత నిర్ణయాలు తీసుకోని అమలు చేశారు, అందులో సర్జికల్ స్టిక్స్, వైమానిక దాడులు, పెద్ద నోట్ల రద్దు,జిఎస్టి,ఆర్టికల్ 370 రదు,త్రిపుల్ తలక్ రదు ,అయోధ్యలో రామ మందిర నిర్మాణం,తాజాగా వక్ఫ బోర్డ్ సవరణ.. మరెన్నో చారిత్రక నిర్ణయాలను తీసుకొని భారతదేశాన్ని ప్రగతి పథంలో ముందుకు తీసుకెళ్తూ ప్రపంచంలోనే ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ నిలిచిందని అన్నారు

**పేద ప్రజల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పలు పథకాలు..**

ఉజ్వల యోజన ( ఉచిత గ్యాస్ సిలిండర్), స్వచ్ఛభారత్,హార్ ఘర్ జల్, ముద్ర యోజన, ఆయుష్మాన్ భరత్, కిసాన్ సమ్మాన్ నిధి, ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ యోజన,కరోనా సమయం నుండి దేశ ప్రజలందరికీ ఉచిత రేషన్ బియ్యం వంటి ఎన్నో కేంద్ర ప్రభుత్వ పథకాలు అమలు చేశారాని అన్నారు,తెలంగాణ అభివృద్ధికి మోడీ ప్రభుత్వం గణనీయంగా కృషి చేస్తుందని, రామగుండం ఎరువుల ఫ్యాక్టరీను పున ప్రారంభించడం ద్వారా రాష్ట్ర రైతులకు ఎరువుల కొరత లేకుండా చూశారు, రాష్ట్ర రైతాంగానికి అవసరమైన ఎరువులు విత్తనాలు యంత్రికరణం మద్దతు ధర కిసాన్ సమ్మాన్ నిధి సాయం, భీమా, రుణాలు అందుబాటులోకి తీసుకొచ్చి, వ్యవసాయ అభివృద్ధికి తోడ్పటు అందిస్తుందన్నారు, నిజామాబాద్ పసుపు బోడు ఏర్పాటు, పెద్ద ఎత్తున జాతీయ రహదారుల రైల్వే లైన్లు నిర్మించి రాష్ట్రంలో రవాణా సదుపాయాలు మెరుగు పరచడమే కాకుండా మరెన్నో అభివృద్ధి కార్యక్రమాలకు తెలంగాణ రాష్ట్రానికి పెద్దపీట వేయడం జరిగింది, గత 11 ఏళ్లలో మోడీ ప్రభుత్వం 10 లక్షల కోట్ల రూపాయలు తెలంగాణ అభివృద్ధికి సంక్షేమానికి వేచించిందని కార్పొరేటర్ ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కళ్లెం రవీందర్ రెడ్డి , జక్కిడి ప్రభాకర్ రెడ్డి ,మల్కాజిగిరి పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ బండారి భాస్కర్ , డివిజన్ అధ్యక్షులు గంగాని శ్రీను , జిల్లా నాయకులు ఉగాది ఎల్లప్ప , పారంద మహేష్ , జంజ్య నాయక్ , అధ్యక్షురాలు పార్వతి , డివిజన్ ప్రధాన కార్యదర్శిలు సంఘీ అశోక్ , గోవింద చారి స్థానిక నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# డాక్టర్ సగరపు ప్రసాద్‌ను అభినందించిన..

- సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి.

**సూర్యాపేట,విశాలభారతి:**

పిసిసి నాయకులు, ప్రముఖ హైకోర్టు న్యాయవాది డాక్టర్ సగరపు ప్రసాద్ కు ఇటీవల డాక్టరేట్ రావడంతో శుక్రవారం హైదరాబాద్ లోని సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి నివాసంలో శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కొప్పుల వేణారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులుగా,న్యాయవాదిగా, ప్రజా సంగ్రామం దినపత్రిక ఎడిటర్ గా సమాజంలో విశేష సేవలు అందిస్తున్న డాక్టర్ ప్రసాద్ రానున్న రోజుల్లో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఆయన వెంట పలువురు న్యాయవాదులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.



# యేసు క్రీస్తూ మానవ విమోచన క్రయదనమే "గుడ్ ఫ్రైడే '

- బిషప్ దుర్గం ప్రభాకర్
- బేతెస్థ మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు

**సూర్యాపేట,విశాలభారతి:**

సూర్యాపేట జిల్లా కేంద్రం లోని 4వ వార్డు నందు బేతెస్థ ప్రార్థన మందిరంలో గుడ్ ఫ్రైడే సందర్భంగా బేతెస్థ మినిస్ట్రీస్ ఫౌండర్, అధ్యక్షులు బిషప్ దుర్గం ప్రభాకర్ క్రైస్తవ ప్రజలకు, భక్తులకు గుడ్ ఫ్రైడే శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా అత్యధికంగా 90 శాతం ప్రజలు ఆరాధిస్తున్న దేవుడు యేసు క్రీస్తూ అనీ, శిలువలో ప్రేమ ను గూర్చి ప్రపంచానికి బోధించారనీ తెలిపారు. గుడ్ ఫ్రైడే అనగా క్రీస్తును శిలువ వెయ్యటం, కల్వరి కొండ వద్ద అతని మరణం యొక్క జ్ఞాపకాలను గుర్తుచేసుకొనే క్రైస్తవమత విశ్వాసకులకి, ప్రపంచ మానవాళికి గొప్ప రక్షణ దినమనీ, ఈ పవిత్ర వారం సమయంలో పవిత్రమైన మూడు రోజులలో భాగంగా ఈస్టర్ ఆదివారానికి ముందు వచ్చే శుక్రవారం రోజున యేసు క్రీస్తూ మానవాళి పాపములు క్షమించబడుటకొరకు తన్ను తాను శిలువ మరణం కొరకు తన ప్రాణంను అర్పించుకొన్నాడనీ గుర్తు చేశారు. తరచుగా పాసోవర్ పై యూదుల అభిప్రాయంతో సరిగ్గా సరిపోలుతుందనీ దీనిని హోలీ ఫ్రైడే, బ్లాక్ ఫ్రైడే లేదా గ్రేట్ ఫ్రైడే అని కూడా పిలువబడుతుందనీ తెలిపారు. క్రీస్తు సువార్తల ఆధారంగా క్రీస్తును శిలువ వెయ్యటం శుక్రవారమే జరిగిందనీ, రెండు వేర్వేరు సమూహాలచే గుడ్ ఫ్రైడే యొక్క సంవత్సరం క్రీ .శ. 33 గా అంచనా వెయ్యబడిందన్నారు. ఈ కార్యక్రమంలో యడవెల్లి యేసుపాదం, ఆదిమూళ్ళ బాబు, మామిడి కిరణ్, పేతురు, జానయ్య, సురేష్, వెంకన్న, అంజి, పాల్వాయి అజయ్ తదితరులు పాల్గొన్నారు.

vishalabharathi Telugu Daily

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

శనివారం,
19.04.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com





## సతీష్ మ్యూజిక్ అకాడమీ కీ డప్పులు బహుకరణ

- డా" మద్దెమడుగు సైదులు

గరిడేపల్లి, శాలభారతి:

అప్పన్నపేట గ్రామానికి చెందిన సతీష్ మ్యూజిక్ అకాడమీకీ మండల కేంద్రంలోని పొనుగోడు గ్రామానికి చెందిన క్రీ,, శే,, మద్దెమడుగు గురవయ్య జ్ఞాపకర్థం అయన కుమారుడు డా,, మద్దెమడుగు సైదులు శోభ దంపతులు 15వేల రూపాయలు విలువైన 20డప్పులను సతీష్ మ్యూజిక్ అకాడమీ వారికీ అందజేశారు. కళారంగంలో పురుషులకు దీటుగా రాణిస్తున్న మహిళలను డా,, మద్దెమడుగు సైదులు అభినందించారు. సతీష్ మ్యూజిక్ అకాడమీ వారికీ ఎల్లపుడు సహాయ సహకారాలు అందిస్తున్న డా,, మద్దెమడుగు సైదులు కీ డాక్టరేట్ పొందిన సందర్బంగా బృందం సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



## వృద్ధాప్యంలో తల్లిదండ్రులను బాగా చూసుకోవాలి

- చౌటుప్పల్ సిఐ మన్మథ కుమార్

చౌటుప్పల్, విశాలభారతి:

పట్టణ కేంద్రంలోని తెలంగాణ స్టేట్ సీనియర్ సిటిజన్ అసోసియేషన్ చౌటుప్పల్ శాఖ ఆధ్వర్యంలో తల్లిదండ్రుల మరియు వయోదికుల పోషణ, సంక్షేమ చట్టం 2007 నియమావళి 2011లోని ముఖ్యాంశాలకు సంబంధించిన పోస్టర్ను చౌటుప్పల్ పోలీస్ స్టేషన్ ఆవరణలో సీఐ మన్మథ కుమార్ ఆవిష్కరించారు. తదనంతరం వారు మాట్లాడుతూ కనిపెంచి పెద్ద చేసిన తల్లిదండ్రుల పట్ల ప్రేమ, ఆప్యాయత పెంపొందించుకోవాల్సిన బాధ్యత కుటుంబ సభ్యులకు ఉందని, వృద్ధాప్యంలో తల్లిదండ్రులను బాగా చూసుకోవాలని అది మన బాధ్యత అని వారికి ఉన్న కొద్ది సమయాన్ని ప్రశాంతంగా ఉండేలా చూసుకోవాలని ఆయన గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ సీనియర్ సిటిజన్ అసోసియేషన్ యాదాద్రి భువనగిరి జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి ఎర్రగుంట వెంకటేశం, జిల్లా కోశాధికారి దుర్గాయ నరసింహారావు, మండల శాఖ అధ్యక్షులు కానుగుల వెంకటయ్య, ప్రధాన కార్యదర్శి గోషిక లక్ష్మయ్య, ఉపాధ్యక్షులు బొమ్మిడి సత్తిరెడ్డి, ఎండి ఖలీల్, మరియు సీనియర్ సిటిజన్స్ పాల్గొన్నారు.

## దమ్ముంటే రాజీనామా చెయ్

- మల్ రెడ్డి రంగారెడ్డి కి మంచిరెడ్డి సవాల్

* సమస్యలను గాలికి వదిలేసి మంత్రి పదవి కోసం తిరుగుతున్నాడు

- గత ప్రభుత్వంలో చేసిన శంకుస్థాపనలనే మళ్లీ మళ్లీ ప్రారంభిస్తున్నారు

* మల్ రెడ్డి పై మంచిరెడ్డి ఆరోపణలు



ఇబ్రహీంపట్నం,విశాలభారతి :

మంత్రి పదవి రాకుంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానన్న మల్ రెడ్డి రంగారెడ్డి దమ్ముంటే రాజీనామా చేయాలని జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు , ఇబ్రహీంపట్నం మాజీ మంచిరెడ్డి కిషన్ రెడ్డి అన్నారు.శుక్రవారం మండలంలోని శేరిగూడ సీ.కే కన్వెన్షన్ హాల్ లో బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభకు సంబంధించి నిర్వహించిన ఇబ్రహీంపట్నం నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశం అనంతరం, జిల్లా పార్టీ అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్ రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడారు. మంత్రి పదవి రాకపోతే రాజీనామా చేస్తానన్న ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి "దమ్ముంటే ఇప్పుడే రాజీనామా చెయ్" అంటూ డిమాండ్ చేశారు. నియోజకవర్గం అభివృద్ధిని, సమస్యలను గాలికి వదిలేసి మంత్రి పదవి కోసం తిరుగుతూ కాలం గడుపుతున్నారని ఆయన మండిపడ్డారు. "సంవత్సరన్నర కాలంగా నియోజకవర్గంలో అభివృద్ధి పూర్తిగా శూన్యం. గత ప్రభుత్వంలో చేసిన శంకుస్థాపనలనే మళ్లీ మళ్లీ చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారు" అని విమర్శించారు. ప్రజా క్షేత్రంలో పదవులు శాశ్వతం కావనీ. ప్రజల కోసం చేసే సేవే శాశ్వతమనీ ఆయన స్పష్టం చేశారు.

## పేద ప్రజలకు వరం సీఎం రిలీఫ్ ఫండ్

- 15 మంది లబ్ధిదారులకు మంజూరైన 6 లక్షల 88 వేల రూపాయల
- సి.ఎం.ఆర్.ఎఫ్ చెక్ లు పంపిణీ చేసిన తెలంగాణ పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి.

సూర్యాపేట, విశాలభారతి:

పేద ప్రజలకు వరంమని సీఎం రిలీఫ్ ఫండ్ అని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా సూర్యాపేట నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 15 మంది లబ్ధిదారులకు మంజూరైన 6 లక్షల 88 వేల రూపాయల సి.ఎం.ఆర్.ఎఫ్ చెక్ లను లబ్ధిదారులకు ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పటేల్ రమేష్రెడ్డి మాట్లాడుతూ...భారతదేశంలోనే సిఎంఆర్ ఎఫ్ పథకం ద్వారా పేదల ఆరోగ్యానికి అత్యదిక ప్రాధాన్యత ఇస్తున్న ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వమని, రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు రేవంత్ రెడ్డి రాష్ట్రంలో వైద్యం,విద్యకు పెద్దపీట వేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 15 నెలల్లోనే వెయ్యి కోట్ల సీఎం రిలీఫ్ ఫండ్ నిధులను ఇప్పటి వరకు ఇచ్చిందని, కానీ పది సంవత్సరాలలో బిఆర్ఎస్ ప్రభుత్వం ఇన్ని నిధులు ఎన్నడూ ఇవ్వలేదని విమర్శించారు. సిఎంఆర్ఎఫ్ పథకం పేదలకు ఉపయోగపడుతుందని, అనారోగ్యంతో బాధపడుతున్న వారు చికిత్స కోసం తమను సంప్రదిస్తే సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సహాయం చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా సిఎంఆర్ఎఫ్ పథకం ద్వారా చెక్ లు అందుకున్న లబ్ధిదారులు పటేల్ రమేష్ రెడ్డి, జిల్లా ఇంఛార్జ్ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు , జిల్లా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, నల్గొండ ఎంపి రఘువీరారెడ్డిలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్ గుప్తా, టిపిసిసి అధికార ప్రతినిధి ధరావత్ వెంకన్న నాయక్, ప్రముఖ వైద్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు రామ్మూర్తి యాదవ్, నాయకులు వెలుగు వెంకన్న, తండు శ్రీనివాస్ గౌడ్, జ్యోతుల కర్ణాకర్, సూదిరెడ్డి సత్య నారాయణ రెడ్డి,వల్దాస్ దేవేం దర్, పారుక్, అరవింద్ రెడ్డి, పాలడుగు పరుశరాములు, కుంచం అంజయ్య, సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## భూగర్భ డ్రైనేజ్ పనులను పరిశీలించిన కార్పోరేటర్



నాచారం,విశాలభారతి:

మల్లాపూర్ డివిజన్ పరిధిలోని, సూర్యనగర్ కాలనీలోని రోడ్ నెంబరు 3లో జరుగుతున్న భూగర్భ డ్రైనేజ్ పనులను కార్పోరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక కాలనీ వాసులు డ్రైనేజ్ పైపు లైను మరో 40 మీటర్ల మేర పొండిగుంపు అవసరమని కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. సానుకూలంగా స్పందించిన కార్పొరేటర్ త్వరలోనే 40 మీటర్ల డ్రైనేజి లైను పొడిగింపు కొరకు తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాలనీ వాసులు కోతి యాదగిరి గౌడ్, నర్సింగరావు, నాగేశ్వర్ రావు, చిన్న, శీలం ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు

# భూ భారతి చట్టం రైతులకు చుట్టం

- రైతులకు భూభారతి న్యాయం జరుగుతుంది
- ఏళ్ల తరబడి ఉన్న భూ సమస్యలకు పరిష్కారం
- గత ధరణితో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు
- రైతులకు అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు



పినపాక, విశాలభారతి:

ప్రజల కోసం, ప్రత్యేకంగా రైతుల భూములపై భరోసా కల్పించేందుకు ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చిందని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. పినపాక మండల కేంద్రంలోని జివిఆర్ కల్యాణ మండపంలో భూ భారతి చట్టం అవగాహన సదస్సును పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు తో కలిసి శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూ సమస్యలపై రైతులు మీసేవలో దరఖాస్తు చేసుకుంటే నిర్దేశించిన సమయంలో స్థానిక తాసిల్దారులు పరిష్కరిస్తారన్నారు.ఈ చట్టం ద్వారా భూములకు సంబంధించి అవినీతిని అరికట్టి రెవెన్యూ శాఖను బలోపేతం చేసేందుకు ఉపయోగపడుతుందన్నారు. లోటుపాట్లు, ఇబ్బందులు లేకుండా ముందుకు వెళ్లడానికి పైలట్ స్టడీ కోసం ప్రత్యేకించి కొన్ని మండలాలను ప్రభుత్వం ఎంపిక చేసిందన్నారు. ధరణి స్థానంలో తీసుకొచ్చిన భూభారతి నూతన ఆర్వోఆర్ చట్టం భూ వివాదాలకు పరిష్కారం చూపుతుందని పేర్కొన్నారు. వివాదాలకు తావు లేకుండా రైతుల భూములపై వారికి పూర్తి యాజమాన్య హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం అనేక కొత్త అంశాలను పొందుపరుస్తూ కొత్త చట్టాన్ని తెచ్చిందన్నారు. ఈ చట్టం ద్వారా రికార్డుల్లో తప్పుల సవరణలకు ఆస్కారం ఉంటుందన్నారు. రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చేసేందుకు ముందు భూముల వివరాలు పూర్తిస్థాయిలో సర్వే చేసి మ్యాప్ తయారు చేయనున్నట్లు చెప్పారు. వారసత్వంగా వచ్చిన భూములకు ముందు సమగ్ర విచారణ చేస్తామన్నారు. గ్రామస్థాయిలోని సమస్యలపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టి పరిష్కరించే దిశగా చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో దామోదర్ రావు, ఏడిఏ తాతారావు, తాసిల్దార్ అద్దంకి నరేష్, ఎంపీడీవో సునీల్ కుమార్, ఎంపీఓ వెంకటేశ్వరరావు, డిప్యూటీ తాసిల్దార్ సమ్మయ్య, అగ్రికల్చర్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, ఏపీఓ వీరభద్రస్వామి, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ నాయకులు, మండలానికి చెందిన వందలాదిమంది రైతులు పాల్గొన్నారు.



## గులాబీ జెండా గుండెల నిండా

- బిఆర్ఎస్ సిల్వర్ జూబ్లీ సభకు భారీగా జనసమీకరణ
- నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశంలో నిర్ణయం
- గ్రామ గ్రామాన గులాబీ జెండా ఎగరాలి
- ప్రతి గ్రామం నుండి దండుగా కదలాలి
- పండగలా రజతోత్సవ వేడుకలు
- జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్ రెడ్డి పిలుపు



ఇబ్రహీంపట్నం,విశాలభారతి:

గులాబీ జెండా గుండెల నిండా నింపుకొని, ప్రభుత్వ పాలనను తెలంగాణ ప్రజలు మరోసారి కోరుకుంటున్నారని రంగారెడ్డి జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షుడు ,ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మున్సిపాలిటీలోని శేరిగూడ సీకే కన్వెన్షన్ హాల్ లో జరిగిన నియోజకవర్గ స్థాయి సమన్వయ కమిటీ సమావేశంలో మంచిరెడ్డి కిషన్ రెడ్డి ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ
బీఆర్ఎస్ తెలంగాణ రాష్ట్రం కోసం ఏర్పాటైన పార్టీ అని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో పదేళ్లు రాష్ట్రం సర్వోతోముఖాభివృద్ధి జరిగిందన్నారు. ప్రతిపక్ష పార్టీగా ప్రజల సమస్యలపైన బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని, ప్రభుత్వాన్ని నిలదీస్తుందని పేర్కొన్నారు. ఈ నెల 27 న వరంగల్ లో జరిగే రజతోత్సవ సభకు పెద్ద సంఖ్యలో ప్రజలు, నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని పిలుపు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు క్యామ మల్లేష్ , మంచి రెడ్డి ప్రశాంత్ రెడ్డి , జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకట రమణారెడ్డి , జిల్లా రైతుబంధు మాజీ అధ్యక్షుడు వంగేటి లక్ష్మారెడ్డి , సీనియర్ నాయకులు దండెం రాంరెడ్డి , జక్క రాంరెడ్డి , మాజీ మార్కెట్ చైర్మన్ ఏర్పుల చంద్రయ్య , మాజీ ఎంపిపి కృపేష్ , మున్సిపల్ అధ్యక్షుడు అల్వాల్ వెంకట్ రెడ్డి , మండల పార్టీ అధ్యక్షులు బుగ్గరాములు , రమేశ్ గౌడ్ , కిషన్ గౌడ్ , చీరాల రమేశ్ , బిందు రంగారెడ్డి , మంచిరెడ్డి ప్రతాప్ రెడ్డి , చిన్నోళ్ల యాదయ్య , భరత్ కుమార్ , భరత్ రెడ్డి , జెర్కోని రాజు , నిట్టు జగదీశ్ , శివసాయి తదితరులు పాల్గొన్నారు...



## తెలంగాణ ఉద్యమకారుల ప్లీనరీ పోస్టర్ఆవిష్కరణ

సికింద్రాబాద్, విశాలభారతి:

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో ఈ నెల 21న నిర్వహించే ప్లీనర్ కి రావాలని పలువురు నాయకులను ఆహ్వానించారు. రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాస్ ఆదేశానుసారం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యే రామకృష్ణా రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రామచంద్ర రావు తదితరులను కలిసి ఈ నెల 21 న సీతాఫల్మండి మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ లో జరగబోయే తెలంగాణ ఉద్యమకారుల ప్లీనరీ కి ఆహ్వానించారు. అనంతరం ప్లీనరీకి సంబంధించిన పోస్టర్ ను ఆవిష్కరించారు .ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లూరి అనిల్ కుమార్, గ్రేటర్ కన్వీనర్ జగన్ యాదవ్ పాల్గొన్నారు.



## స్నేహితురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

- రూ. 50 ఆర్థికసాయం చేసిన చిన్ననాటి మిత్రులు

ఇబ్రహీంపట్నం,విశాలభారతి:

అనారోగ్యంతో స్నేహితురాలు మృతిచెందగా ఆమె కుటుంబానికి చిన్ననాటి స్నేహితులు ఆర్థికంగా ఆదుకున్నారు. యాచారం మండలంలోని మేడిపల్లి నక్కర్త గ్రామానికి చెందిన నిలకంటి మాధవి (31) అనారోగ్యంతో మృతి చెందింది. ఈమెకు ఇద్దరు కుమారులు ఉన్నారు. తన తల్లిని కోల్పోయిన కుమారులకు ఆర్థిక సాయంగా 2009 లో మేడిపల్లి నక్కర్త జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసుకున్న ఆనాటి మిత్రులు ఒక్కటై విరాళాలు సేకరించి రూ. 50 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాధవి కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో బన్నె శ్రీశైలం, లింగం, కనమోని వెంకటేష్, మహేష్, మక్కపల్లి కర్ణాకర్, రవిచందర్, శేఖర్, పాండు, విజయ్, తదితరులు ఉన్నారు.

## కిషన్ రెడ్డిపై అంజన్ కుమార్ చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలి

- పార్టీలో ఉనికి కోల్పోయిన అంజన్ కుమార్ యాదవ్
- సహనం కోల్పోయి ఇష్టానుసారం మాట్లాడుతున్నారు
- బహిరంగ క్షమాపణ చెప్పాలి
- మేకల సారంగపాణి




సికింద్రాబాద్, విశాలభారతి :

రెండు సార్లు పార్లమెంటు సభ్యులుగా పనిచేసిన అంజన్ కుమార్ యాదవ్ బాధ్యతాయుతంగా వ్యవహరించవలసింది పోయి మతిభ్రమించి నిప్పులాంటిమనిషి అయిన నిజాయితీపరుడైన కేంద్ర మంత్రి గంగాపురం కిషన్ రెడ్డి పైన చేసిన వాక్యాలను వెంటనే ఉపసంహరించుకోవాలని బిజెపి సీనియర్ నాయకుడు మేకల సారంగపాణి డిమాండ్ చేశారు. లేకుంటే సికింద్రాబాద్ నియోజకవర్గంలో తిరగనియ్యమని హెచ్చరించారు. కల్లు తాగిన పిచ్చి కోతిలా అంజన్ కుమార్ మాట్లాడారని ఇది అన్ పార్లమెంటరీ లాంగ్వేజ్లో మతిభ్రమించి మాట్లాడారని ఇది మంచి పద్ధతి కాదని సారంగపాణి అన్నారు. సొంత పార్టీలో ఉనికి కోల్పోయిన అంజన్ కుమార్ యాదవ్ సహనం కోల్పోయి కాంగ్రెస్ పార్టీ నాయకులను ఇష్టానుసారం మాట్లాడుతున్నారని దిక్కుతోచని పరిస్థితులలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పై అక్కసు వెళ్ళిబోసున్నారని వెంటనే అన్న మాటలపై బహిరంగ క్షమాపణ చెప్పి తను చేసిన తప్పులను సరిదిద్దుకోవాలని లేకుంటే ఆంజన్ కుమార్ యాదవ్ ఎక్కడ తిరుగుతే అక్కడ అడ్డుకుంటామని పిచ్చి కుక్కను తరిమినట్టు వెంబడిస్తామని మేకల సారంగపాణి హెచ్చరించారు. అంజన్ కుమార్ యాదవ్ దిష్టిబొమ్మను సీతాఫల్మండి శివాజీ విగ్రహం దగ్గర కార్యకర్తలందరూ కలిసి దానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో నాగేశ్వర్ రెడ్డి, రాచమల్ల కృష్ణమూర్తి,కనకట్ల హరి, వేణు యాదవ్, పోచయ్య యాదవ్, ఆకారం రమేష్, వెంకటేష్ గౌడ్, శారదా ఉడుత మల్లేష్, వీరన్న, ప్రకాష్ గౌడ్, ప్రభు గుప్తా,సేతు మహేష్, అంబాల రాజేశ్వరరావు, రాము వర్మ, గణేష్ ముదిరాజ్, ఇవి నరేష్, ఉపేందర్ యాదవ్, సౌందర్య, ఆదర్శ ముదిరాజ్, సింహాచలం బాబు, ఈ ఎల్ ప్రతాప్, ముత్తు మంజుల, పస్తం కుమార్, కరుణాకర్, ఆకుల సంపత్, హంసరాజ్, వినయ్ కుమార్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## నూతన వధూవరులను ఆశీర్వదించిన పెద్ది కృష్ణమూర్తి గౌడ్

**దేవరుప్పల, విశాలభారతి:** మండలం,ధర్మాపురం పడమటి తండా(డి) గ్రామానికి చెందిన జాటోత్ రవిలలిత దంపతుల ధ్వితీయ పుత్రిక దివ్యచిరంజీవిల వివాహానికి హాజరై ఆశీర్వదించిన దేవరుప్పుల పిఏసిఎస్ డైరెక్టర్ పెద్ది కృష్ణ మూర్తి గౌడ్. ఈ కార్యక్రమంలోపాలకుర్తి నియోజకవర్గ ఉపాధ్యక్షుడు ఉప్పుల సాయి ప్రకాష్,గ్రామ పార్టీ అధ్యక్షుడు జాటోత్ వీరన్న, ఉపాధ్యక్షుడు జాటోతు శీను,తోట కూరి రమేష్,కారుతుల యాకస్వామి,పత్తేపురం శేఖర్,ఆకుల సంతోష్,పెద్ది రంజిత్, గుగులోతు రాజన్న, జాటోత్ రాంసింగ్, లకావత్ సోమన్న, జాటోతు శత్రు, జాటోత్ బద్రు, జాటోత్ అమల, అనిత, సుజాత, నీలా, కమలమ్మ, యాదమ్మ,విజయపాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న ఎస్సై సృజన్ కుమార్



**దేవరుప్పల, విశాలభారతి:** మండలంలో అతి వేగంతో డ్రైవ్ చేస్తున్న ద్విచక్రదారుడు అదుపు తప్పి బైక్ ముళ్ళపొదల్లోకి దూసుకెళ్లడంతో మైలా అనిల్ తండ్రి లక్ష్మయ్య అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. గురువారం అర్ధరాత్రి సమయంలో చౌడూరులో ఎస్సై ఊర సృజన్ కుమార్ పెట్రోలింగ్ చేస్తున్న క్రమంలో రోడ్డు పక్కనే ముళ్ళ పొదల్లో అనిల్ అనే వ్యక్తి పడి ఉండడం చూసిన ఎస్సై ఆ వ్యక్తిని ముళ్ళపొదల్లో నుంచి బైటికి తియ్యడంతో అప్పటికే తీవ్ర గాయాలతో ఉండడం చూసిన ఆయన వెంటనే స్పందించి అంబులెన్స్ ద్వారా జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించి ఎస్సై సృజన్ కుమార్ తన మానవత్వాన్ని చాటుకున్నారు.

## ప్రైవేట్ వ్యాపారస్తుల చేతిలో మోసపోతున్న రైతన్నలు



**దేవరుప్పల, విశాలభారతి:** యాసింగ్ సీజన్లో పండించిన పంట మార్కెట్లో పోసి తెలంగాణ సర్కారు రైతులు పండించిన పంటను సకాలంలో కొనుగోలు చేయకపోవడంతో రైతన్నలు ధాన్యం కొనుగోలు కోసం పడిగాపులు కాస్తున్నారు.కేంద్రాలు ప్రారంభించిన గ్రామాల్లో కాంటాలు రాకపోవడంతో రైతులు తక్కువ ధరకు దళారులకు ధాన్యం విక్రయిస్తున్నారు. ప్రభుత్వ మద్దతు ధర రూ.2320(ఏగ్రేడ్), 2300 మామూలు రకానికి ఉండగా, రైతులు ప్రవేటు వ్యాపారులకు, విక్రయిస్తు మద్దతు కోల్పపోతటం జరుగుతుంది. అదే విధంగా దేవరుప్పుల మండలంలో చోటు చేసుకుంది, సీతారాంపురం గ్రామ ప్రధాన రహదారి వద్ద ప్రైవేట్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం విక్రయిస్తూ మద్దతు ధర కోల్పపోతున్నరైతులు,ఈధాన్యం కొనుగోలు కేంద్రం ప్రధాన రహదారికి అనుకొని ఉండడంతో ఈ ప్రదేశం నిత్యం రద్దీగా ఉండడం తో ప్రధాన రహదారిపై వచ్చి పోయే వాహనాలకు ఇబ్బంది కరంగా ఏర్పడుతుంది, ఏలాంటి సూచికలు లేకుండా నిబంధనకు విరుద్ధంగా రోడ్డు పై పార్కింగ్ చేయడంతో వచ్చి పోయే వాహనాలకు ఇబ్బందులు ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది, మరి కొన్ని గ్రామాలలో వ్యాపారస్తులు కల్లాల వద్దకు వెళ్లి కొనుగోలు చేసి రైతులు ప్రైవేట్ కొనుగోలు దారులను వాయిదా లలో పైసలు చెల్లిస్తామని చెప్పి కొంతమంది వ్యాపారస్తులు రైతులకు ధాన్యం డబ్బులు చెల్లించకుండా చేతులు ఎత్తేసిన వ్యాపారస్తులు కూడా ఉన్నారు.



## యేసుక్రీస్తు ప్రభువు సిలువపై మరణించిన రోజు గుడ్ ఫ్రై డే

**తిరుమలగిరి, విశాలభారతి:** మున్సిపాలిటీలో సి ఎస్ ఐ సెయింట్ మార్క్ చర్చ్ లో గుడ్ ఫ్రైడే పండుగను శుక్రవారం నాడు భక్తిశ్రద్ధలతో క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. స్థానిక పాస్టేట్ చైర్మన్, పాస్టర్ రెవరెండ్ డి. పురుషోత్తం మాట్లాడుతూ ఏసుక్రీస్తు సిలువపై ఏడు మాటలు మాట్లాడి మరణించారని క్రైస్తవులు విశ్వసిస్తారు. మానవాళి సంక్షేమం కోసం ప్రేమ, దయ, కరుణ, క్షమాపణ మారుమనస్సు లాంటి యేసుక్రీస్తు ప్రభువు అని బోధిస్తుంటారు. అది నచ్చని అప్పటి రాజులు క్రీస్తును సిలువ వేస్తారు. ఆ రోజునే క్రైస్తవులు గుడ్ ఫ్రైడే గా జరుపుకుంటారు.ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు గంట సాల్మన్, మద్దెల ప్రభుదాస్, గంట యాకూబ్, కాటమల్ల మాణిక్యరావు, గంట సాలమోన్, దాసరి ప్రకాష్, జాన్సన్, గంట సందీప్, పి ధనమ్మ, జి పుష్ప, బి ధనమ్మ, జి మేరీ, స్వీటీ, కే సుకన్య, మద్దెల అపరంజమ్మ, గంట మౌనిక, జయశీల, ఓస పుష్ప, శోభ, జయప్రద, తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణ లక్ష్మి చెక్కును అందజేసిన ఎమ్మెల్యే పాయం



**పినపాక, విశాలభారతి:** పేద ఇంటి ఆడబిడ్డలకు కల్యాణ లక్ష్మి ఒక వరం లాంటిదని కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే కళ్యాణ లక్ష్మి చెక్కులను ఆలస్యం లేకుండా దళారులకు తావివ్వకుండా వెంటనే అందజేస్తున్నామని పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం ఆయన పినపాక మండలానికి చెందిన వికలాంగురాలు కొప్పుల స్వరూపకి కళ్యాణ లక్ష్మి చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ అద్దంకి నరేష్ , ఎంపీడీవో సునీల్ కుమార్, కాంగ్రెస్ నాయకులు గంగిరెడ్డి వెంకటరెడ్డి ,శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ కళ్యాణి, మాజీ ప్రజా ప్రతినిధులు,పినపాక మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


# విశాల భారతి
తెలుగు దిన పత్రిక

శనివారం,
19.04.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com




## నూతన వరుడిని ఆశీర్వదించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి

**దేవరుప్పల, విశాలభారతి:** మండలం,రామరాజుపల్లి గ్రామ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త బోయిని యాదగిరి కుమారుడు బోయిని ఉపేందర్ వివాహానికి హాజరై నూతన వరుడిని ఆశీర్వదించిన మాజీ మంత్రి,పాలకుర్తి బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి ఎర్రబెల్లి దయాకర్ రావు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు,స్థానిక నాయకులు,తదితరులు పాల్గొన్నారు.



# మునగ చెట్టులో ప్రతి భాగం ఉపయోగకరమైనదే

- రైతులు మునగ సాగుపై దృష్టి సారించాలి
- మునగ సాగు రైతులకు వరం లాంటిది
- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్



**పినపాక, విశాలభారతి:** మునగ చెట్టులో ప్రతీ భాగం ఉపయోగకరమైనదని, వీటి ఆకులు, కాయలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. శుక్రవారం పినపాక మండలం ఈ బయ్యారం క్రాస్ రోడ్ లో సాగు చేస్తున్న మునగతోటను ఆయన మండల అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్ లో మునగకు భారీ డిమాండ్ ఉంటుందన్నారు. ఆరోగ్యపరంగానే కాకుండా, వ్యాపారపరంగానూ మునగను సాగు చేసేవారి సంఖ్య క్రమంగా పెరుగుతున్నదని, ఇటీవలి పరిశోధనలతో ఏకవార్షిక రకాలు అంటే ఆరు నెలల్లోనే కాతకు వచ్చే రకాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. సాగులో మెలకువలు పాటిస్తే, మేలైన దిగుబడులు సాధించవచ్చని సూచించారు.మునగ సాగు రైతులకు ఒక వరం లాంటిదని ప్రతి రైతు కనీసం ఒక్క ఎకరంలోనైనా మునగ సాగు చేసేలా ఎంపీడీవోలు అవగాహన కల్పించాలన్నారు. పోడు భూముల్లో మునగ సాగు చేసే రైతులకు బోర్ల పర్మిషన్ల కోసం ఫారెస్ట్ ఆఫీసర్లతో మాట్లాడుతానన్నారు.జిల్లాలోని ఆదర్శ రైతులంతా మునగ సాగుపై దృష్టి సారించాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా మునగ సాగు చేపట్టేలా రైతులు ముందుకు రావాలన్నారు. మునగ సాగు రైతులకు అండగా ఉంటామన్నారు. మునగ పంట సాగు చేస్తున్న రైతు వర్మను జిల్లా కలెక్టర్ శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సునీల్ కుమార్, ఎంపీ ఓ వెంకటేశ్వరరావు, ఏపీఓ వీరభద్ర స్వామి, అగ్రికల్చర్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, ఉపాధి హామీ సిబ్బంది, ఈ బయ్యారం సెక్రటరీ జైపాల్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు గంగిరెడ్డి వెంకటరెడ్డి, రైతులు పాల్గొన్నారు.



## మాజీ సర్పంచ్ ని పరామర్శించిన గాదరి కిషోర్

**నూతనకల్, విశాలభారతి:** నూతనకల్ మండలం చిల్పకుంట్ల గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో బాధపడుతున్న చిల్పకుంట్ల మాజీ సర్పంచ్ కొంపెల్లి రామిరెడ్డిని తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ పరామర్శించారు. రామ్ రెడ్డి ఇంటి దగ్గరికి వచ్చి వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. రామ్ రెడ్డి ఆరోగ్యం త్వరగా కుదుటపడాలని ఆకాంక్షించారు. అనంతరం ఆరోగ్య సమస్యతో బాధపడుతూనటువంటి పులుసు కనకయ్యని, ఇటీవల విద్యుత్ ఘాతానికి గురైనటువంటి పంతం కృష్ణారెడ్డిని కలిసి పరామర్శించారు. మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ భిక్కి బుచ్చయ్య గౌడ్, బిఆర్ఎస్ మండల అధికార ప్రతినిధి బత్తుల విద్యాసాగర్ , టిఆర్ఎస్ ఎస్ఎస్ఎల్ మండల అధ్యక్షులు బత్తుల విజయ్ కుమార్, మాజీ సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షుడు చూడి లింగారెడ్డి, మందడి సోమిరెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు పులుసు లింగమల్లయ్య, బిఆర్ఎస్ నాయకులు బత్తుల గురవయ్య, గడ్డం యాదగిరి పంతం యాకయ్య, బత్తుల వెంకన్న, శ్రీనాథ్, రామచంద్రు మోతే ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## హుజూర్నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గా నందిపాటి కోటయ్య



**గరిడేపల్లి, విశాలభారతి:** పొనుగోడు గ్రామానికి చెందిన నందిపాటి కోటయ్య వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ గా నియమితులయ్యారు. తనను మార్కెట్ కమిటీ డైరెక్టర్ గా నియమించినందుకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నందిపాటి కోటయ్య సుదీర్ఘకాలం కాంగ్రెస్ పార్టీలో పనిచేస్తూ, వార్డు మెంబర్ గా ,ఎంపిటిసిగా ప్రత్యక్ష ఎన్నికలలో పోటీ చేశారు. మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీ వీర విధేయుడుగా ఉంటూ, పొనుగోడు గ్రామంలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేసారు. పార్టీ నమ్ముకున్న వ్యక్తికి ఏదో ఒక రోజు న్యాయం జరుగుతుంది అని నందిపాటి కోటయ్య ఒక ఉదాహరణ అని,కష్టపడ్డ కార్యకర్తకు దక్కిన ఫలితంగా పొనుగోడు గ్రామ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కొనియాడారు. హుజూర్నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎన్నికకు సహకరించిన గరిడేపల్లి మండల మరియు పొనుగోడు గ్రామ కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.



## ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్,మాజీ ఎంపీ అంజన్ కుమార్ల పై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు

**చౌటుప్పల్, విశాలభారతి:** పట్టణ కేంద్రంలోని భారత ప్రధాని నరేంద్ర మోడీని మరియు భారతీయ జనతా పార్టీ నాయకుల పై కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ మరియు మాజీ ఎంపీ అంజన్ కుమార్లు తీవ్రమైన భాష అనుచిత వ్యాఖ్యలు, దుర్భాషలాడినందు చౌటుప్పల్ బీజేవైఎం ఆధ్వర్యంలో నిరసన తెలపడం జరిగింది. తదుపరి అట్టి అనుచిత వ్యాఖ్యలకు గాను వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడం జరిగింది. తదనంతరం బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి దిండు భాస్కర్ మాట్లాడుతూ కోట్లాది ప్రజల అభిమాన నాయకుడు అయిన భారత ప్రధాని నరేంద్ర మోడీ పై చేసిన వాక్యాలను తీవ్రంగా ఖండిస్తున్నాం. ప్రజాస్వామ్యం పై ఎ మాత్రం చిత్తశుద్ధి ఉంటే కాంగ్రెస్ పార్టీ అద్దంకి దయాకర్ ను ఎమ్మెల్సీ కథనుండి తొలగించాలని, స్థాయి మరిచి మాట్లాడిన అంజన్ కుమార్ వెంటనే బేషరతుగా క్షమాపణలు చెప్పాలని,లేని పక్షంలో యువమోర్చా కార్యకర్తల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం మండల అధ్యక్షులు పబ్బు వంశి గౌడ్,రాష్ట్ర నాయకులు మునగాల రాజశేఖర్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి చింతపల్లి వినయ్ రెడ్డి, ఉపాధ్యక్షులు పందుల శరత్, చిన్నగోని శివ, ఓరగంటి భాను, నాగరాజు, ఎల్మ వినయ్ రెడ్డి, దూసరి శివ సాయి, మరియు యువ మోర్చా కార్యకర్తలు పాల్గొన్నారు.



## మమ్మల్ని సురక్షిత ప్రాంతాలకు తరలించాలి

- జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేసిన రాజపేట, విట్టల్ రావు నగర్ గ్రామస్తులు

**మణుగూరు, విశాలభారతి:** మండలంలోని రాజుపేట విట్టల్ రావు నగర్, పీకే వన్, బాపనగుంట గ్రామాలు సింగరేణి ఎఫెక్ట్ ఏరియాతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు, గ్రామస్తులు,శుక్రవారం నాడు తహసిల్దార్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ను కలిసి తమ గోడును వివరించారు. ఇప్పటికే ప్రతిరోజు సింగరేణి బ్లాస్టింగ్ తో ఇల్లులు దెబ్బతిన్నాయని గోడలు బీటల వారి , క్రాకులు వచ్చాయని దుమ్ము ధూళి ఇండ్ల మీద పడడం, చెట్ల మీద పడడంతో మంచినీరు కూడా కాలుష్యం అయిపోయిందని, ప్రతిరోజు గ్రామాలలో ఏదో ఒక సమస్యతోవ్యక్తి ప్రజల రోగాల బారిన పడి ఆసుపత్రిలో పాలవుతున్నామని , ఈ ఏరియాలలో సింగరేణి కోసం భూములు ఇచ్చే రైతుల ఇల్లు కూడా ఉన్నాయని ,కేవలం 50 మీటర్ల దూరం నుండే మా గ్రామ పక్క నుంచి సింగరేణి ఎఫెక్ట్ జరుగుతుందని, ఇంత దగ్గరగా బ్లాస్టింగ్ జరిగితే ఈ గ్రామాలలో మేము ఎలా జీవించాలని వారు వాపోయారు. 1 కిలోమీటర్ దూరం నుంచే బ్లాస్టింగ్ జరిగితే ఇండ్లు ఊగిపోతున్నాయని, తెలిపారు. 50 మీటర్ల దూరంలో బ్లాస్టింగ్ జరిగితే మేము ఎలా నివసించాలని, సంబంధిత అధికారులు దృష్టి సారించి మాకు కూడా పరిహారం ఇచ్చి ,మమ్మల్ని సురక్షిత ప్రాంతాలకు తరలించి, మమ్మల్ని ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజుపేట ,విట్టల్ రావు నగర్ ,పీకే వన్ సెంటర్ రైతులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక



# క్లాసిక్ లుక్కులో కనువిందు చేసేలా..



సౌత్ నార్త్ అని తేడా లేకుండా ఈమధ్య బాగా బిజీ అవుతున్న నటి పూజా హెగ్డే మళ్లీ తన అందంతో అభిమానులను విశ్వరూపం చూపిస్తోంది. ఇటీవల ఆమె సోషల్ మీడియాలో షేర్ చేసిన కొన్ని ఫోటోలు నెటిజన్లను కట్టిపడేస్తున్నాయి. హల్కా పచ్చ రంగు లెహంగాలో పూజా కనిపించిన ఈ స్టిల్స్ కు లక్షల్లో లైకులు వచ్చాయి. ఫోటోలో ఆమె ఫోజులు, నేచురల్ లైటింగ్ కలిసిపోవడంతో అదిరిపోయే విజువల్స్ వచ్చాయి. ఫోటోలలో పూజా రెట్రో స్టైల్ లోని పల్లెటూరి అమ్మాయిలా కనిపిస్తోంది. చేతికి ఎర్రచూడీలు, మెడలో సంప్రదాయ నగలు, జుట్టును విడదీసి వేసుకోవడం.. ఇవన్నీ చూస్తుంటే ఆమెలోని లుక్స్ ఎప్పటికప్పుడు కొత్తగా హైలెట్ అవుతాయని చెప్పవచ్చు. సింపుల్ గాను, ఎలిగెంట్ గాను ఉండే ఆ లుక్ సోషల్ మీడియాలో మంచి ట్రెండ్ సెట్ చేస్తోంది. పూజా కెరీర్ విషయానికి వస్తే, ఆమె "ఒక లైలా కోసం" సినిమాతో తెలుగు ప్రేక్షకులను పలకరించింది. తర్వాత దువ్వాడ జగన్నాధం, అరవింద సమేత, అల.. వైకుంఠపురములోరాధే శ్యామ్, మహర్షి, మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్ వంటి చిత్రాలతో స్టార్ హీరోయిన్‌గా పేరు తెచ్చుకుంది. బాలీవుడ్‌లోనూ పూజా "హౌస్‌ఫుల్ 4", "రాధే శ్యామ్", "సర్కస్" వంటి చిత్రాల్లో కనిపించి అక్కడి మార్కెట్లో తనకంటూ ఓ స్థానం ఏర్పరచుకుంది. ఇటీవల ఆమె నటన కంటే ఫ్యాషన్, ఫోటోషూట్లతోనే ఎక్కువగా హైలైట్ అవుతోంది. ఆమె ఫోటోలు ఫ్యాషన్ లవర్స్ కు స్పెషల్ ఇన్‌స్పిరేషన్ లా మారుతున్నాయి. ప్రతి లుక్‌లోనూ కాస్త క్లాసికల్ టచ్ ఉండేలా చూసుకుంటోంది. సాంప్రదాయతను మోడర్న్ స్టైలింగ్‌తో మిక్స్ చేసి చూపించడంలో పూజా కి మంచి నైపుణ్యం ఉంది. ఇక ఈ ఫోటోలలో ఆమె కూర్చున్న తన తీరు చూస్తే, పూజా హెగ్డే నిజంగా ఒక పర్ఫెక్ట్ గ్లామరస్ హీరోయిన్ అని ఫాలోవర్స్ పాజిటివ్ గా స్పందిస్తున్నారు.



## స్టార్ బాయ్‌కి బిగ్ ఛాలెంజ్

తెలుగు ప్రేక్షకులు రొటీన్ సినిమాలని అంగీకరించడం లేదు. కోవిడ్ తరువాత నుంచి ప్రేక్షకుల్లో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్న విషయం తలిసిందే. ప్రపంచ సినిమాపై పట్టు సాధించడం, ఓటీటీల్లో వివిధ భాషలకు సంబంధించిన సినిమాలు, కొత్త తరహా కథలు చూడటంతో రొటీన్ కథలతో వచ్చే మూవీస్‌ని నిర్దాక్షిణ్యంగా తిరస్కరిస్తున్నారు. దీంతో మన వాళ్లు కొత్త కాన్సెప్ట్‌లకే పట్టంకడుతున్నారు. ప్రేక్షకులు ఇంత క్లారిటీతో ఉంటే స్టార్ బాయ్ సిద్ధూ మాత్రం ఇందుకు భిన్నంగా అడుగులు వేస్తున్నాడు. చాలా రోజుల తరువాత `డీజె టిల్లు` మూవీతో బ్లాక్ బస్టర్ హిట్‌ని సొంతం చేసుకుని స్టార్ బాయ్‌గా మారిన సిద్ధూ పాపులర్ అయిన టిల్లుని మర్చిపోవడం లేదు. ప్రతి సినిమాకు అదే క్యారెక్టర్‌ని ఫాలో అవుతుండటం పలువురిని షాక్ కు గురి చేస్తోంది. `డీజె` టిల్లు` తరువాత సీక్వెల్ అంటూ చేసిన `టిల్లు స్క్వేర్` ఫరవాలేదు అనిపించింది. పెద్దగా కథ లేకుండా టిల్లు క్యారెక్టర్‌తో మ్యాజిక్ చేయాలని ప్రయత్నించాడు కానీ ఆ స్థాయిలో మాత్రం ప్రేక్షకుల్ని ఆకట్టుకోలేకపోయాడు. ఆ విషయాన్ని గ్రహించలేకపోయిన సిద్ధూ మరోసారి హిట్ కోసం టిల్లు క్యారెక్టర్‌నే నమ్ముకుని `జాక్` సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చాడు. బొమ్మరిల్లు భాస్కర్ డైరెక్ట్ చేసిన ఈ మూవీ స్పై యాక్షన్ కామెడీగా రూపొందింది. స్పై థ్రిల్లర్‌ని తన చేతివాటంతో కంగాళీ చేసిన సిద్ధూ ఫైనల్ అవుట్ పుట్ వచ్చే సరికి సగం వండేసి వదిలిన వంటకంగా మార్చడంతో ప్రేక్షకులు ఈ ప్రాజెక్ట్‌కు షాక్ ఇచ్చారు. రీసెంట్‌గా విడుదలైన ఈ సినిమా ప్రేక్షకుల్ని ఏమాత్రం ఎట్రాక్ట్ చేయలేక బాక్సాఫీస్ వద్ద బోల్తాకొట్టేసి సిద్ధూకు షాక్ ఇచ్చింది. ఈ సినిమా ఫలితంతో అయినా టిల్లు ఫీవర్‌ని వీడి కొత్త తరహా పాత్రతో ప్రేక్షకుల ముందుకు రావడం తప్ప వేరే గత్యంతరం లేదనే సంకేతాల్ని అందించింది. ఈ మూవీ తరువాత సిద్ధూ జొన్నలగడ్డ నటిస్తున్న మూవీ `తెలుసు కదా`. కాస్ట్యూమ్స్ డిజైనర్ నీరజ కోన ఈ మూవీ ద్వారా డైరెక్టర్‌గా పరిచయం అవుతోంది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మిస్తున్న ఈ ప్రాజెక్ట్ రెగ్యులర్ షూటింగ్ గత ఏడాది ఆగస్టు లో మొదలైంది. ఫస్ట్ లుక్ పోస్టర్‌ని బట్టి చూస్తుంటే 90వ దశకం నేపథ్యంలో ఈ సినిమా సాగుతుందని తెలుస్తోంది. ఈ సినిమా ఇప్పుడు స్టార్ బాయ్ సిద్ధూకు బిగ్ ఛాలెంజ్‌గా మారింది. టిల్లు ఫ్లేవర్ లేకుండా హిట్ కొడతాడా? లేక మళ్లీ అదే ఫార్ములాని నమ్ముకుని కెరీర్‌ని ఇబ్బందుల్లోకి నెట్టుకుంటాడా? అన్నది తెలియాలంటే సినిమా విడుదల వరకు వేచి చూడాల్సిందే.



## జిమ్ లో తెలుగమ్మాయి వర్కౌట్స్..

సినీ ఇండస్ట్రీలో ఇప్పుడు అనేక మంది తెలుగమ్మాయిలు తమ టాలెంట్ తో రానిస్తున్నారు. మంచి ఛాన్సులు అందుకుని అదరగొడుతున్నారు. అలాంటి వారిలో శాన్వి మేఘన కూడా ఒకరు. ైదరాబాద్ బ్యూటీ అయిన ఆమె.. తక్కువ సినిమాలతో మంచి క్రేజ్ సంపాదించుకుందనే చెప్పాలి. తనకంటూ ప్రత్యేక గుర్తింపు సొంతం చేసుకుంది అమ్మడు. సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్ గా ఉండే శాన్వీ.. తాజాగా క్యూట్ సెల్ఫీలను పోస్ట్ చేసింది. హైదరాబాద్ లోని ఓ ఫిట్ నెస్ స్టూడియోలో దిగిన పిక్స్ షేర్ చేసిన అమ్మడు.. తన వర్కౌట్స్ రిజల్ట్ ను చూపించేసింది! బ్లాక్ టాప్, కలర్ ఫుల్ షార్ట్ వేసుకున్న బ్యూటీ.. తన కర్లీ హెయిర్ తో బ్యూటిఫుల్ గా ఉందని చెప్పడంలో ఎలాంటి డౌట్ అక్కర్లేదు. ఇన్స్పిరేషన్ కాదు.. డిసిప్లైన్ గురించి ఆలోచించండంటూ ఇచ్చి క్యాప్షన్ బట్టి ఆమె డెడికేషన్ ఎలా ఉందో క్లియర్ గా చెప్పవచ్చు. మొత్తానికి శాన్వీ పోస్ట్.. ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. కొన్ని నిమిషాల్లో వేలల్లో లైక్స్ అండ్ కామెంట్స్ వచ్చాయి. సో క్యూట్ మేడమ్ అని నెటిజన్లు చెబుతున్నారు. సూపరో సూపర్ అని అంటున్నారు. nఇక ఆమె కెరీర్ విషయానికొస్తే.. హైదరాబాద్ లోనే పుట్టి పెరిగిన శాన్వీ మేఘన.. మెగాస్టార్ చిరంజీవి సైరా నరసింహారెడ్డి మూవీతో తన సినీ జర్నీని స్టార్ట్ చేసింది. 2019లో ఆ సినిమా రిలీజైంది. ఆ తర్వాత నెట్ ఫ్లిక్స్ తెలుగు ఒరిజినల్ పిట్ట కథలు (2021)తో మంచి గుర్తింపు సంపాదించుకుందనే చెప్పాలి. అనంతరం వివిధ ప్రాజెక్టుల్లో ఛాన్సులు వచ్చాయి. బిలాల్ పూర్ పోలీస్ స్టేషన్, పుష్పక విమానం, మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్ వంటి పలు చిత్రాల్లో నటించి ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది అమ్మడు. కోలీవుడ్ లో కుటుంబస్థాన్ మూవీ చేసి మంచి సక్సెస్ అందుకుంది. ఆ తర్వాత రీసెంట్ గా తెలుగులో టుక్ టుక్ మూవీతో సందడి చేసిన విషయం తెలిసిందే.ఇప్పుడు ఇండస్ట్రీలో భారీ ఆఫర్స్ అందుకునేందుకు ట్రై చేస్తోంది శాన్వీ మేఘన.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.